01ATP29_01ATP29.qxd 29-04-2023 PM 11:16 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 30 ఏప్రిల్ 2023 పేజీలు : 04

# నేను చేసిన భూ సేకరణ న్యాయ సమ్మతం

## 'అందరికీ ఇళ్లు' లక్ష్యంతో పనిచేశా

### - కేతిరెడ్డి మాటలు విన్న రైతులు మోసపోయి నష్టపోయారు : గోనుగుంట్ల సూర్యనారాయణ



మాట్లాడుతున్న గోనుగుంట్ల సూర్యనారాయణ

**ధర్మవరం టౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

నియోజకవర్గంలో ఇల్లులేని ప్రతి కుటుంబానికీ ఇంటిస్థలంతో పాటు ఇంటిని ఇవ్వాలన్న లక్ష్యంతో 2017లో తాను చేసిన 745.51 ఎకరాల భూ సేకరణ న్యాయసమ్మతమే కాకుండా చట్టబద్ధమని మాజీ ఎంఎల్ఎ గోనుగుంట్ల సూర్యనారాయణ అన్నారు. ఇటీవల ధర్మవరంలో ముఖ్యమంత్రి క్యాన్వాయ్‌ను రైతులు అడ్డుకున్న ఘటనపై తరచూ వస్తున్న వార్తలపై ఆయన స్పందించి శనివారం విలేకర్లతో మాట్లాడారు. భూములు ఇచ్చిన రైతులకు సాధ్యమైనంత ఎక్కువగా లబ్ధిచేకూర్చేందుకు కృషి చేశానని ఆయన తెలిపారు. పోతులనాగేపల్లి పొలంలో పుట్టపర్తి రోడ్డుకు ఇరువైపులా 254.26 ఎకరాల భూమి,మల్లాకాలువ లో 71.65 ఎకరాలు, గొట్లూరు గ్రామంలో 254.13 ఎకరాలు, కునుతూరులో 59.35 ఎకరాలు,రేగాటిపల్లిలో 106.12 ఎకరాలను సేకరించినట్లు తెలిపారు. ఇందుకు రూ.23,59,44,000లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఆనాటి ప్రభుత్వ నిబంధనల మేరకు భూమివిలువ ఎకరాకు రూ.1.25 లక్షలు ఉండగా బహిరంగ మార్కెట్ విలువ రూ.5 నుండి 6 లక్షలు ఉందన్నారు. కలెక్టర్ మాత్రం ఎకరాకు రూ.3.60 లక్షలు ఇస్తామని చెప్పగా,తీవ్రంగా ప్రయత్నించి వత్తిడి పెంచడంతో చివరకు రూ.5లక్షలు ఇచ్చేవిధంగా నిర్ణయించినట్లు తెలిపారు. భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో అదనంగా ఎకరాకు 5సెంట్ల స్థలం ఇచ్చేవిధంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పుట్టపర్తి రోడ్డు పక్కన విలువైన స్థలాలను ఇచ్చేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. తమ నిర్ణయాన్ని కొందరు రైతులు అంగీకరించగా మరికొందరు అప్పటి ప్రతిపక్ష నాయకుడు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాయమాటలు విని వ్యతిరేకించారన్నారు. ఎంతనచ్చచెప్పినా రైతులు వినకపోవడంతో నిబంధనల మేరకు కోర్టులో నిధులు జమచేసి భూములను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. భూ సేకరణను వ్యతిరేకించే రైతులకు తాను అధికారంలోకి రాగానే ఎకరాకు రూ.20 లక్షలు పరిహారంతో పాటు 20 సెంట్ల స్థలం ఇప్పిస్తానని నమ్మబలికినట్లు ఆయన గుర్తుచేశారు. ఇది దేశంలో ఎక్కడైనా జరిగిందా అంటూ ఆయన విమర్శించారు. కేతిరెడ్డి మాటలు విని మోసపోయిన రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు వాపోయారు. తన మాట ప్రకారం రైతులు అంగీకరించిఉంటే ఎకరాకు రూ.5లక్షల పరిహారంతో పాటు అదనంగా ఇచ్చే 5 సెంట్ల స్థలానికి రూ.20 లక్షల ఆదాయం వచ్చేదన్నారు. అధికారంలోకి వచ్చిన కేతిరెడ్డి చెప్పిన మేరకు రైతులకు ఎందుకు న్యాయం చేయలేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. పరిహారాన్ని కోర్టులో జమచేస్తే తిరిగి పరిహారం పెంచే అవకాశంలేదన్న విషయం గతంలో ఎంఎల్ఎగా పనిచేసిన కేతిరెడ్డికి తెలియదనుకోవాలా అంటూ ఆయన విమర్శించారు. తాను ఎంఎల్ఎ కాకమునుపే నియోజకవర్గంలో 22వేల కుటుంబాలకు ఇల్లు అవసరమని గుర్తించామని తెలిపారు. దీని ప్రకారం అప్పటి కేంద్ర మంత్రి వెంకటయ్యానాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులను ఒప్పించి 17వేల అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి ఉత్తర్వులు తెచ్చామన్నారు. ఇందులో 4వేల అపార్ట్‌మెంట్లు ప్యాదిండిరోడ్డు పక్కన నిర్మించామని వాటిని ఇంకనూ పంపిణీ చేయలేదని ఆయన విమర్శించారు. మిగిలిన 13వేల అపార్ట్‌మెంట్లను పోతుకుంట పొలంలో నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా రూ.2.50లక్షలు ఇచ్చామన్నారు. ఇంటి నిర్మాణ వ్యయం ఐదింతలు పెరిగినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తోందని వాపోయారు. తాము వేసిన లేఔట్‌ను మార్చడంతో పాటు తాము ఇచ్చిన ఇంటిప్లాట్లను కూడా రద్దుచేశారని వాపోయారు. వారు ఇచ్చిన లబ్ధిదారుల్లో దాదాపు 60శాతం మంది అనర్హులేనని ఆయన ఆరోపించారు. తాను సేకరించిన భూమిలో పట్టాలు ఇచ్చి గొప్పలు చెప్పుకుంటున్నారని ఆయన విమర్శించారు. ఎవరో వండి వార్చిన భోజనంతిని పైశాచిక తృప్తిచెందుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఇళ్లనిర్మాణంలో కూడా అధికారపార్టీ వారిదే పెత్తనమని, దీంతో ఇంటి నిర్మాణ వ్యయం పెరగడంతో లబ్దిదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన వాపోయారు. అప్పులు కట్టలేని పేదల ఇంటి పునాదులను బలవంతంగా రాయించుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన ఆరోపించారు. ఇళ్ళు నిర్మించుకోలేని నిరుపేదలకు మంజూరైన ఇంటిస్థలాలను వాలంటీర్ల ద్వారా బలవంతంగా రాయించుకుని నాయకులు ఇతరులకు అమ్ముకుంటున్నారని ఆయన వాపోయారు. వీటిని మానుకోవాలని ఆయన హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో తాను అధికారంలోకి వస్తామని, ఇంటిప్లాట్ల మంజూరులో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి అనర్హుల ప్లాట్లను రద్దుచేసి అర్హులకు ఇస్తామని తెలిపారు. ఇందుకు సహకరించిన అధికారులు, నాయకులపై కూడా చర్యలు తప్పవన్నారు. ప్రజలను మభ్యపెట్టి దగాచేయడం మానుకోకపోతే ప్రజలు నమ్మే పరిస్థితి ఉండదని ఆయన ఎంఎల్ఎ కేతిరెడ్డికి హితవు పలికారు. ఈ సందర్భంగా ముస్లింలు గోనుగుంట్లను సాంప్రదాయరీతిన సత్కరించారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# జగన్ పార్టీలో జగడం

### -అవినీతి ఛైర్‌పర్సన్ తప్పుకోవాలన్న అసమ్మతి
### - ఆధారాలు చూపాలని ఇంద్రజ కౌంటర్
### -రెండు నిమిషాల్లో కౌన్సిల్ మీట్ ముగియడంపై టిడిపి ఫైర్



నేలపై ప్లకార్డులతో వైసిపి కౌన్సిలర్ల నిరసన



బైటాయించిన టిడిపి సభ్యులు

**హిందూపురం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

హిందూపురం మున్సిపల్‌కౌన్సిల్‌లో అసమ్మతి మరింత ముదిరింది. శనివారం ఉదయం ఛైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశం కేవలం రెండు నిమిషాల్లో ముగించడంపై కౌన్సిలర్ల నుండి తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. అజెండాలోని అంశాలపై చర్చ కూడా జరగకుండానే ముగించడం గమనించిన వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు శివకుమార్, అసిఫుల్లా, తదితరులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తూ దూసుకొచ్చారు. మున్సిపాలిటీలో పలు అంశాలపై ఛైర్‌పర్సన్ ఇంద్రజ అనుసరిస్తున్న విధానాలు అవినీతికి కారణమవుతున్నాయని ఆరోపించారు. అజెండాలోని అంశాలే కాకుండా టేబుల్ అజెండా రూపొందించి అందులో పది వివాదాస్పద అంశాలను పెట్టి ఆమోదింపచేసుకోవాలని ఛైర్‌పర్సన్ ప్రయత్నిస్తున్నారని వారు మండిపడ్డారు. దీంతో ఒకే పార్టీకి చెందిన కౌన్సిలర్ల మధ్య రచ్చ ప్రారంభమైంది. తన సీటు నుండి ఛైర్‌పర్సన్ వెళ్లిపోవడంతో కౌన్సిల్‌హాల్‌లో అసమ్మతి వర్గానికి చెందిన 14 మంది వైసిపి కౌన్సిలర్లు ప్లకార్డులు చేతబూని నేలపై కూర్చుని నిరసనకు దిగారు. చెత్తపాలన ఛైర్‌పర్సన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం అసమ్మతి కౌన్సిలర్ శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ పరిగి బస్టాండ్‌లో మార్కెట్ హోల్‌సేల్ వ్యాపారులు, పూలవ్యాపారులకు దుకాణాలు కేటాయించేందుకు లక్షలాది రూపాయల అవినీతికి ఛైర్‌పర్సన్ పాల్పడ్డారని ఆరోపించారు. అంతేకాకుండా పట్టణ ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసినా ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. సంబంధిత కాంట్రాక్టర్ పర్సెంటేజీలు ఇవ్వలేదని అందుకే అది పెండింగ్‌లో పడిందన్నారు. రైల్వేరోడ్డు విస్తరిస్తామని చెప్పిన ఛైర్‌పర్సన్ తన పదవీకాలం ముగిసేలోపు చేస్తారా అంటూ ప్రశ్నించారు. మున్సిపాలిటీలో చెత్తపాలన సాగుతోందని చేతకాకపోతే ఆ పదవికి రాజీనామా చేసి వెళ్లిపోవాలని సలహా ఇచ్చారు. అసమ్మతి సభ్యులు ఆరోపణలపై ఇంద్రజ తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ తాను అవినీతికి పాల్పడి వుంటే ఆధారాలు వుంటే చూపాలని సవాల్ విసిరారు. మార్కెట్ వ్యాపారులు, ప్రజలకు మంచి జరగాలన్నదే తమ ప్రయత్నమన్నారు. సెంట్రల్ లైటింగ్ సిస్టంలో సంబంధిత కాంట్రాక్టర్‌ను తాను పర్సెంటేజీలు అడగలేదని ఆర్‌అండ్‌బి శాఖ వారు రోడ్డు కటింగ్‌కు 15 లక్షలు కట్టాలని చెప్పడంతో ఆ డబ్బు చెల్లింపులో జాప్యమవుతోందన్నారు. రైల్వేరోడ్డు విస్తరణ 70 శాతం పూర్తయిందని సకాలంలో పూర్తి చేస్తామన్నారు. మరోవైపు తెలుగుదేశంపార్టీకి చెందిన కౌన్సిలర్లు డిఇ రమేష్, సతీష్, రాఘవేంద్ర, తదితరులు ఛైర్‌పర్సన్ పోడియం వద్ద కూర్చొని ఆందోళనకు దిగారు. పట్టణ ప్రజల సమస్యలు చర్చించకుండా రెండు నిమిషాల్లో కౌన్సిల్ సమావేశం ఎలా ముగిస్తారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 మంది వైసిపి కౌన్సిలర్లను జనం గెలిపిస్తే మీరు డ్రామాలు ఆడుతూ ప్రజల సమస్యలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఎమ్మెల్యే బాలకృష్ణ కృషితో మంచినీటి పథకం హిందూపురంకు రావడం వల్ల నేడు ప్రజలకు నీటి సమస్య లేదన్నారు. మున్సిపల్‌వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతంలోని పోచనపల్లి వద్ద పెన్నానది బ్రిడ్జి రెండేళ్ల క్రితం వరదకు కొట్టుకపోయిందన్నారు. తాత్కాలిక మరమ్మతులు మాత్రమే చేయడం వల్ల ఇటీవల రెండు లారీలు ఆ బ్రిడ్జి వద్ద బోల్తాపడ్డాయని స్కూల్ బస్సులు నిత్యం ఆ మార్గంలో వెళుతుంటాయని బస్సులకు ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంఎల్‌సి ఇక్బాల్ ఇప్పటికైనా స్పందించి అధికారులతో మాట్లాడి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు తెప్పించే ప్రయత్నం చేయాలని కోరారు. గతంలో కళాశాలల వద్ద ఈవ్‌టీజింగ్‌లు జరగకుండా పోలీసులు పర్యవేక్షణ చేసేవారని ఇప్పుడు అసలు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు తమ విధులను ఎందుకు నిర్వర్తించడం లేదని వారు ప్రశ్నించారు.



ఆరోపణలు ఖండిస్తున్న ఛైర్‌పర్సన్




# మెగా పీపుల్స్ సర్వేకు అపూర్వ స్పందన



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- అనంత నియోజకవర్గంలో 85,865 కుటుంబాలను నేరుగా కలిశాం
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం, వైసీపీపై ప్రజల్లో ఎనలేని విశ్వాసం
- దేశ చరిత్రలో ఎవరూ చేయని విధంగా ప్రజాభిప్రాయం తీసుకున్నాం
- నమ్మకం, విశ్వాసానికి చిరునామా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త బ్యూరో**

మా నమ్మకం సర్వే జగనన్న నినాదంతో జగనన్నే మా భవిష్యత్ పేరుతో చేపట్టిన మెగా పీపుల్స్ సర్వేకు అపూర్వ స్పందన లభించిందని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. సర్వేలో తమ అభిప్రాయం తెలియజేసిన ప్రజలకు, సర్వేను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. శనివారం 40వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లిప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ చరిత్రలో ఎవరూ చేయని విధంగా ఈ నెల 7వ తేది నుంచి జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వే నిర్వహించి ప్రజా మద్దతు కోరినట్లు తెలిపారు. అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 85,865 కుటుంబాలను నేరుగా కలిసి ఫీడ్ బ్యాక్ తీసుకున్నట్లు చెప్పారు. చంద్రబాబు పాలనకు, జగన్ పాలనకు తేడాను వివరించడంతోపాటు సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం, ప్రభుత్వం పనితీరు పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లవుతోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేఊమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ అని విమర్శించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని స్పష్టం చేశారు. అందుకే సార్వత్రిక ఎన్నికల్లోనే కాకుండా మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా వైసీపీకి పట్టం కట్టారని గుర్తు చేశారు. అనంతపురం నియోజకవర్గంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కొగటం విజయభాస్కర్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఫయాజ్, జేసిఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, చింతకుంట మధు, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ రిజ్వాన్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, వైసీపీ నాయకులు ఖాదర్, షరీఫ్, సందీప్, ఇసాక్, నల్లప్ప గుజ్జల లక్ష్మణ్, పార్వతి, మహబూబ్‌ఖాన్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# పెన్నహోబిళ క్షేత్రంలో ఘోర అపరాధం..!



పెన్నహోబిళ క్షేత్రంలో చక్రాలు బిగిస్తుండగా కూలిపోయిన శ్రీ లక్ష్మినరసింహుని రథం



పూర్తిగా శిథిలమైన రథం

- -చెదలు పట్టి పూర్తిగా శిథిలమైన రథానికి కొత్త చక్రాలు బిగించే ప్రయత్నం విఫలమై కుప్పకూలిన రథం
- -1428 సంవత్సరంలో సదాశివరాయలు పాలనలో ఏర్పాటైన శ్రీ లక్ష్మినరసింహుని రథం ధ్వంసం
- -ఉరవకొండ ప్రాంతంలో ఏం అరిష్టం జరుగబోతుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్న భక్తులు
- -మరమ్మత్తులు వద్దన్నా వినకుండా అధికారులు వ్యవహరించిన తీరు మనోభావాలు దెబ్బ తీసిందంటున్న భక్తులు
- -మూడేళ్ళుగా భక్తుల నుండి వసూలైన విరాళాలతో కొత్తరథం ఎందుకు తయారు చేయలేదని ప్రశ్న
- -మే 10న రథోత్సవం రోజు ప్రమాదం జరిగివుంటే ఎవరు బాధ్యతవహిస్తారని మండిపడుతున్న భక్తులు

**ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెన్నహోబిళంలో వెలసిన శ్రీ లక్ష్మినరసింహస్వామివారి రథం కుప్పకూలిపోయి పూర్తిగా ధ్వంసమై ఘోర అపచారం చోటు చేసుకొంది. చెదలుపట్టి పూర్తిగా శిథిలమైన రథానికి శనివారం ఉదయం ఎలాంటి ముందుజాగ్రత్త చర్యలు పాటించకుండా ఆలయ అధికారులు అనాలోచితంగా కేవలం రెండు క్రేన్ల సాయంతో రథం మధ్యలోని పాత చక్రాలను తొలగించి రెండు కొత్త చక్రాలను బిగిస్తున్న క్రమంలో రథం ఒక్కసారిగా కూలిపోగా మరమ్మతుల్లో నిమగ్నమైన కూలీలు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. మరో రెండు రోజుల్లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపధ్యంలో క్షేత్రంలో ఘోర అపచారం జరుగడంపై మునుముందు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని, శ్రీ లక్ష్మినరసింహుని ఆగ్రహానికి ఎవరు బలవుతారోనని భక్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతుల సమయంలో కూలిన రథం బ్రహ్మరథోత్సవంరోజు లక్షలాది మంది భక్తులు రథం లాగుతున్న తరుణంలో కూలిపోయివుంటే ఆ ఘోరాన్ని ఊహించలేమని అంటున్నారు.

మిగతా 2లో...

# కర్ణాటకలో బిజెపి ఖఛ్చితంగా గెలుస్తుంది

- కాంగ్రెస్ ఢిల్లీలో లేదు గల్లీలో లేదు
- తెలంగాణ సచివాలయ ప్రారంభోత్సవానికి మేం వెళ్లాం
- తెలంగాణ బిజెపి చీఫ్ బండి సంజయ్ వెల్లడి



మాట్లాడుతున్న తెలంగాణ బిజెపి చీఫ్ బండి సంజయ్

**అనంతపురం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త బ్యూరో**

తెలంగాణలో నూతనంగా నిర్మించిన సచివాలయ ప్రారంభోత్సవానికి తాము వెళ్లబోమని ఆ రాష్ట్రం బిజెపి అధ్యక్షులు బండి సంజయ్ తెలిపారు. కర్ణాటక ఎన్నికల ప్రచారం అనంతరం ఆయన శనివారం అనంతపురం జిల్లా వచ్చిన సందర్భంగా స్థానిక నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కర్ణాటకలో బిజెపి కచ్చితంగా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. యువత నుంచి అనూహ్య స్పందన వస్తోందని, బిజెపి రాకపోతే అభివృద్ధి ఆగిపోతుందన్న భావన ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ గల్లీ లేదు.. ఢిల్లీ లేదన్నారు. కర్ణాటకలో అధికారంలోకి రావన్నది కాంగ్రెస్ వృథా ప్రయాసలేనన్నారు. కర్ణాటకలో బొట్టు తుడుచుకుంటే అధికారం రాదని, బెట్టు పెట్టుకుంటే వస్తుందని, రాజకీయాల కోసం సాంప్రదాయాలను సైతం అవమానిస్తున్నారన్నారు. కెసిఆర్ దోచుకున్న డబ్బుతో ఎక్కడ ఎన్నికలు జరిగినా బిజెపి ఓటమి కోసం ఖర్చు పెడుతానంటున్నారని బండి సంజయ్ కామెంట్ చేశారు. బావ కళల్లో ఆనందం చూసినట్టు ఓవైసి కళ్లల్లో ఆనందం కోసం సచివాలయ నిర్మాణ విధానం సాగిందంటూ విమర్శించారు. ఈ సమాజంలో బిజెపి అనంతపురం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# తాడిపత్రిలో ప్లెక్సీల కలకలం

**అనంతపురం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త బ్యూరో**




ఏర్పాటు చేసిన ప్లెక్సీలు

అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో ప్రధాన వీధుల్లో పలుచోట్ల శనివారం వేసవి ప్లెక్సీలు చర్చనీయాంశంగా మారింది. డీజిల్ దొంగ ఎవరని ఎమ్మెల్యే పెద్దారెడ్డి మున్సిపల్ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఫోటోలు వేసి ఏర్పాటు చేసిన ప్లెక్సీలు తాడిపత్రి పట్టణ ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. తాడిపత్రి పట్టణంలో ప్రధాన కూడలిలో అధికార వైసీపీ పార్టీ నాయకులు ప్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. గత కొంత కాలంగా తాడిపత్రి మున్సిపాలిటీలో అక్రమంగా డీజిల్ మాఫియా జరుగుతుందని మున్సిపల్ ఛైర్మన్‌జెసి ప్రభాకర్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాడిపత్రి పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన ప్లెక్సీలు చూసి చూసి నగర ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆ ప్లెక్సీలో పేర్కొన్న వివరాలు పరిశీలిస్తే జేసి ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 2014-19 వరకు డీజిల్ కొరకు చేసిన ఖర్చు 5.47 కోట్లు ఉండేది. అప్పట్లో లక్షల లీటర్లు సుమారు 70 రూపాయలు ఉండేది. 2014-2019 వరకు తాడిపత్రి మున్సిపాలిటీలో 8,39,931 లీటర్ల డివిజన్‌లో వినియోగించారు. పెద్దిరెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత వేల లీటర్లు, డీజిల్ రేటు సుమారు 90 రూపాయలు ఉంది. 2019 నుంచి నేటి వరకు తాడిపత్రి మున్సిపాలిటీలో వినియోగించిన డీజిల్ 3,68,671 లీటర్లు వినియోగించారు. డీజిల్ కొరకు ఖర్చు చేసిన సొమ్ము 3.27 కోట్లు, ఎవరి పాలనలో ఎంత ఖర్చు చేశారో తాడిపత్రి ప్రజలే తెలుసుకోవాలని బ్యానర్లు ఏర్పాటు చేశారు. డీజిల్ దొంగ ఎవరు అనేది తాడిపత్రి ప్రజలే తెలుసుకోవాల్సి ప్లెక్సీలలో పేర్కొన్నారు. ఈ ప్లెక్సీలపై తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

# మాతృశిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

- గర్భిణీలు బాలింతలకు పౌష్టికాహారం, రక్తహీనత నివారణకు సంపూర్ణ చర్యలు చేపట్టండి
- ప్రతి రోజూ రెండు మండలాల్లో సిడిపిలో పర్యటించాలి
- కలెక్టర్ పి.అరుణ్‌బాబు

**శ్రీసత్యసాయిజిల్లా(వైద్యం), ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

జిల్లాలో మాతృశిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మాతృశిశు మరణాలపై గర్భిణీలు, బాలింతలకు అందించాల్సిన పౌషికాహారం, రక్తహీనత నివారణకు చేపట్టవలసిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మాతృశిశు మరణాలు తగ్గించాలన్నారు. ఏ తల్లి జన్మనిస్తూ చనిపోకూడదని, ఏ బిడ్డ జన్మిస్తూ మరణించకూడదని మరణాలు ఎలా జరుగుతున్నాయన్న కరాణాలను ముందుగానే గుర్తించి మరణాలు జరగకుండా చూడాలన్నారు. జిల్లాలో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలో

మిగతా 2లో...

02ATP27_02ATP27.qxd 29-04-2023 PM 11:17 Page 1



## ఉపాధి హామీ పనులు 10 మందికి.. కూలీలు 15 మంది.. అధికారుల చేతివాటం


ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

**బొమ్మనహాళ్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉపాధిహామీ పథకం కింద ప్రతిరోజు 3వేల నుంచి 7 వేల మంది దాకా పనులు చేయడం జరిగింది. ఈ పనుల్లో టెక్నికల్ అసిస్టెంట్లు మేట్లు, అధికారులు కుమ్మక్కై ఎక్కడ పని చేస్తారో అక్కడే మస్టర్లు వేయాలని నిబంధనలను తుంగలో తొక్కి 10 మంది పని చేస్తే.. 15 మంది పేర్లు ఆన్‌లైన్‌లో హాజరు వేసి ప్రతి గ్రూపులోనూ 15 మంది పనికి రాకపోయినా వారిపేరుపైన కూలీలు నమోదు చేసి కూలీ డబ్బులు మంజూరు అయిన అనంతరం 5 మంది కూలీల డబ్బులను మూడు భాగాలుగా పంచుకుంటున్నట్లు ఉపాధిహామీ కూలీలు తెలిపారు. ప్రతి రోజు ఒక కూలీకి 150 నుంచి 250 వరకు కూలీ పడాలని నిబంధనలు ఉన్నా వాటిని అమలు చేయడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధిహామీ పనులు చేసిన చోటే మరల అదే ప్రాంతంలో చేసినట్లు చూపి బిల్లులు చేసుకుంటున్నారని చెబుతున్నారు. ఉపాధిహామీ కూలీలు పని చేసే చోట తాగునీరు, చిన్న పిల్లలకు షెల్టర్, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ పాకెట్లు, వాటితోపాటు తార్పాలిన్ పట్లుమంజూరై అవి కూలీలకు చేరడం లేదని ఇందులో అధికారుల చేతి వాటం జోరుగా జరిగిందని ఆయా గ్రామాల్లోని కూలీలు తెలుపుతున్నారు. కూలీల కష్టాలను పంచుకుంటున్న టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపిఎంలు, విటిలపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కరువై స్థానిక అధికారులు గ్రామాలకు రాకపోయినా కూలీలతో ఆడుకుంటున్న చెలగాటాన్ని నిధులు స్వాహా, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉపాధిహామీ కూలీలు కోరుతున్నారు. పై విషయమై ఎంపిడిఓ షకీలా బేగంను వివరణ కోరగా పనుల వద్ద పర్యవేక్షించి తప్పు జరిగి ఉంటే తక్షణమే చర్యలు తీసుకుంటామని నిజమైన కూలీలకు కూలీ డబ్బులు అందిస్తామని వారు తెలిపారు.

## టి సర్కిల్‌లో కుప్పకూలి పడిపోయిన మహిళ


మృతి చెందిన మహిళ

**కళ్యాణదుర్గం టౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మండలంలోని ముదినాన పల్లి ఎరుకుల గంగమ్మ టి సర్కిల్‌లో కుప్పకూలి పడిపోయింది. అక్కడున్న యువకులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ వచ్చి ఆమె ప్రాణం పోయిందని చెప్పారు.

## అత్యధిక మార్కులు సాధించిన గొల్ల సంతోష్


గొల్ల సంతోష్

**బెలుగుప్ప, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మండల పరిధిలో రామసగ్రం గ్రామానికి చెందిన గొల్ల రమేష్ అనే విద్యార్థి ఇంటర్మిడియెట్‌లో 1000 మార్కులకుగాను 986 మార్కులు సాధించారని, హిందూపురంలోని కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలోని అత్యధిక మార్కులు సాధించారని, ఆ ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేశారు. అందులో భాగంగా ఒక సాధారణ కుటుంబంలో జన్మించి ఈ విధంగా మార్కులు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం ఆదుకోవాలని వారి తల్లిదండ్రులు కోరారు.

## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

**కళ్యాణదుర్గం టౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** పట్టణం విషాదం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మిద్దిపై నుంచి కిందకు వస్తున్న వర్షం నీటిని నిలువ ఉంచుదామని ఆశపడ్డ గృహిణికి మృత్యువు కబలించింది. వర్షం జోరుగా కురుస్తుండగా బిందె నిండా నీళ్లు తెస్తామని వెళ్లిన భానుప్రియ (32)కు మిద్దెపై నుంచి కిందకు వేలాడుతున్న విద్యుత్ షాక్ కొట్టింది. అంతే క్షణాల్లో భానుప్రియ మృతి చెందింది. రాచప్ప కుంట ప్రాంతానికి చెందిన పూజారి నరసింహులు అద్దె ఇంట్లో న ఇవాసం ఉంటున్నాడు. ఏడాది వయస్సున్న కూతురు పుట్టిన రోజు శనివారం ఘనంగా జరుపుకోవడానికి ఇంటిని శుభ్రం చేసి వర్షం నీటిని నిల్వ ఉంచుదామని బయటికి వెళ్లిన భార్య భానుప్రియ కళ్లమందే చనిపోవడం చూసి తట్టుకోలేక ఎక్కి ఎక్కి ఏడుస్తున్నాడు. భర్త నరసింహులు, ఈ విషాద ఘటన చూసిన వారంతా కన్నీరు మున్నీరుగా విలపించారు. కళ్యాణదుర్గం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి
### - కమీషనర్, తహశీల్దార్


లబ్దిదారులతో మాట్లాడుతున్న దృశ్యం

**గుత్తి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో లబ్దిదారులు ప్రభుత్వం అందిస్తున్న చేయూతను అందిపుచ్చుకుని పక్కా గృహాలను వేగవంతం చేయాలని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులు, తహశీల్దార్ మహబూబ్‌బాషలు సూచించారు. శనివారం నేమతాబాద్, కొత్తపేట, తాడిపత్రిరోడ్డు, చెట్నేపల్లి లేఅవుట్లలో గృహనిర్మాణాలను వారు పరిశీలించారు. హౌసింగ్‌డే కా ర ్యక్రమాన్ని పురస్కరించుకుని కొత్తపేట గ్రామ సమీపంలోని గృహాలను ఎంపిడిఓ శ్రీనివాసులు తనిఖీ ఏశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా మెప్మా ద్వారా 35 వేల రూపాయల మేర రుణసౌకర్యం లభిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఇ వెంకటేష్, ఇమాంహుసేన్, సుధాకర్, రవికుమార్, సూర్య, సుమన్‌దుర్గా, రేఖ, తదితరులు పాల్గొన్నారు.

## 10వ తేదీలోగా పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోవాలి
### -పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

**ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** ఉరవకొండ ఎస్‌టీఓ కార్యాలయం పరిధిలోగల ప్రతిసర్వీసు పెన్షనర్, కుటుంబపెన్షనర్లు ఈనెల 10వ తేదీలోగా ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.క్రిష్టప్ప, ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటస్వామి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈకేవైసీ ఎస్టీఓ కార్యాలయంతోపాటు పెన్షనర్ల భవనంలోనూ చేస్తున్నారని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో ఆయుర్వే వైద్య శిబిరాలు
### -ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన వైద్యాధికారి ఎస్.యండి.షఫీ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** ఉరవకొండ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం సీనియర్ వైద్యాధికారి డాక్టర్ ఎస్.యండి.షఫీ నేతృత్వంలో పట్టణంలోని మాస్టర్ సీవీవీ, నెహ్రూనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలతోపాటు బసవేశ్వర ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యాధికారి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నిత్యం వ్యాయామం, యోగ, ప్రాణాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టు మహేష్, పీటీఎస్ ఓబులేసప్ప, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వనజాక్షి, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సొంతింటి కల సత్వరం నెరవేరేలా చూడండి
### -జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు


సర్వే నెంబర్ 384లో అధికారులతో కలసి గృహాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

**కొత్తచెరువు, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేక్రమంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన్న జగనన్న హౌసింగ్ లే ఔట్లలోని గృహాలను వేగవంతంగా పూర్తీ చేయాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మండల కేంద్రమైన కొత్తచెరువులోని 384 సర్వే నెంబర్‌లో ఉన్న జగనన్న హౌసింగ్ లే ఔట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సర్వే నెంబర్ 384లో 177ఇళ్ళు, 392లో 197, 483లో 326 ఇళ్ళు వివిధ దశలలో ఉన్నాయని, వాటిని సత్వరం పూర్తీ చేసేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ఇళ్ళ లబ్దిదారులతో ప్రతి రోజూ సంప్రదించి వారి ఇళ్ళ నిర్మాణాలు త్వరితగతిన పూర్తీ చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. బిలో బేస్‌మెంట్, బేస్‌మెంట్, ఆర్ఎల్ స్థాయిలలో ఉన్న గృహాలను పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఆయా లే ఔట్లలో అవసరమైన మౌళిక సదుపాయాలైన విద్యుత్, రహదారులు, నీటి వసతులను ఎలాంటి కొరత లేకుండా వెంటనే కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పిడి చంద్రమౌళి రెడ్డి, తహశీల్దార్‌రామాంజినేయులు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులతో కూడిన భారీవర్షం
### - రూ.2.50 కోట్ల నష్టం


తోటలో మామిడిపిందెలు రాలిన దృశ్యం

**గుత్తి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** గుత్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర ్షం రైతులకు చే దు అనుభ ‌వాన్ని మిగిల్చింది. వర్షపాతం 24.4 మి.మీ వర్షపాతం నమోదైంది. పలుగ్రామాల్లో కర్బూజ, కలింగర, చీనీ, మామిడి, అరటి తోటలు గాలుల దాటికి ధ్వంసమయ్యాయి. కొర్ర, మొక్కజొన్న పంటలు నీటమునిగాయి. దాదాపు 500 ఎకరాల్లో పంటలు అకాల వర్షాం దాటికి నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. దాదాపు 2.50 కోట్ల రూపాయల మేర ఆస్తినష్టం సంభవించినట్లు తెలుస్తోంది. పట్టణంలో పలు కాలనీల్లో విద్యుత్‌స్తంభాలు నేలకూలాయి. దీంతో వి ద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆ శాఖ సిబ్బంది మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్దరించారు.

## సజావుగా నవోదయ ప్రవేశ పరీక్ష
### -32 మంది విద్యార్థుల గైర్హాజరు


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

**ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** 6వ తరగతిలో ప్రవేశానికిగాను శనివారం జరిగిన నవోదయ ప్రవేశ పరీక్ష ఉరవకొండలో సజావుగా జరిగింది. పరీక్షల కోసం పట్టణంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రంలో జరిగిన పరీక్షకు 174 మంది విద్యార్థులు హాజరుకాగా 18 మంది గైర్హాజరయ్యారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో జరిగిన పరీక్షకు 139 మంది హాజరుకాగా 14 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను మండల విద్యాధికారి హెచ్.ఈశ్వరప్ప తనిఖీ చేశారు.

## ఉరవకొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ
### -రికార్డులు తనిఖీ చేసి సీఐ, ఎస్ఐలకు సూచనలు

**ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** ఉరవకొండ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌ను శనివారం జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి సీఐ వి.హరినాథ్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామిలకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు ఎస్పీ కూడేరు, విడపనకల్లు పోలీస్ స్టేషన్లను కూడా తనిఖీ చేశారు.

## ఆమ్ ఆద్మి పార్టీకి ఒక్కసారి అవకాశమివ్వండి
### - ఆప్ అభ్యర్థి దొడ్డకేశవరెడ్డి అభ్యర్థన

**బళ్లారి, ఏప్రిల్29, ప్రభాతవార్త ;** రాష్ట్ర పాలనలో పెనుభూతంగా ఆవరించిన అవినీతి, లంచాల కుంభకోణాలను అణగదొక్కేందుకు ప్రజలు సహకరించాలని, తద్వారా నవ రాష్ట్రాన్ని నిర్మించేందుకు ఒక్కసారి ఆమ్ ఆద్మి పార్టీకి అవకాశమివ్వాలని బళ్లారి నగర విధానసభ క్షేత్రం ఆప్ అభ్యర్థి కొర్లగుంది దొడ్డ కేశవరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నగరక్షేత్రం పరిధిలోని 17, 18, 19 వార్డుల పరిధిలోని బిసిలహళ్లి, గోనాళ్, రూపనగుడి రోడ్డు, సత్యనారాయణపేట ప్రాంతాల్లో శనివారంనాడు విస్తృతంగా ప్రచారం చేపట్టిన అభ్యర్థి దొడ్డకేశవరెడ్డి, ఆయన కుమార్తె మంజుల మనోహర్‌రెడ్డి, ఆప్ బళ్లారి మహానగరశాఖ అధ్యక్షుడు జె.వి.మంజునాథ్ ఓటర్లను ఇంటింటికి వెళ్లి ఆప్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. 2013లో నాటి కేంద్ర ప్రభుత్వం అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలు ఖండిస్తూ ఆ ప్రభుత్వంలో జరిగిన అవినీతి గురించి సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. లోక్‌పాల్ వ్యవస్థను జారీలోకి తీసుకురావాలని ఢిల్లీలోని ప్రముఖ మైదానంలో అన్నాహజారే నేతృత్వంలో జరిగిన తీవ్ర పోరాటంలో వివిధ రంగాల్లో సమాజంలో సేవలందిస్తున్న జూనియర్‌లు, వైద్యులు, న్యాయవాదులు, ఉపాధ్యాయ రంగంలో సేవలందిస్తున్న అధ్యాపకులు, ప్రొఫెసర్లతో పాటు ప్రజ్ఞావంతులు పోరాటంలో పాల్గొని అన్నాహజారేకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఆ పోరాటంలో ముందుండి పోరాడిన వ్యక్తి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అని, పోరాటం అనంతరం స్థాపించిన ఆప్ పార్టీ దేశ రాజకీయ పార్టీల్లో సంచలనం సృష్టించిందని, వినూత్నమైన తత్వ సిద్ధాంతాలు అలవర్చుకొని సమాజంలోని శోసితుల, నిరుపేదల అభివృద్ధే ధ్యేయంగా ఆప్ ప్రజల ముందుకు వెళ్లి ఎన్నికల్లో నిలబడిందని, అందుకు ప్రతిఫలంగా దేశ రాజధాని కేంద్రస్థానమైన ఢిల్లీలో రాష్ట్ర పాలన పగ్గాలు చేపట్టడంలో ఆప్ విజయవంతమయ్యిందన్నారు. అలాగే గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో పంజాబ్‌లో అధికార పాలనను కూడా చేపట్టడంలో ఆప్ సఫలీకృతమయ్యిందని చెప్పారు. ఈసారి కర్ణాటకలోనూ ఆప్ అభ్యర్థులు గెలిచి తీరుతారని తెలిపిన ఆయన, బళ్లారిలో తనకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంలో పార్టీ జిల్లా నాయకులు రుద్రయ్యానవళి, వి.బి.మల్లప్ప, సయ్యద్‌అమీర్‌ఖాద్రి, జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మంజునాథ్, నూర్, ప్రదీప్‌రెడ్డి, రాఘవరెడ్డి, రఘుశెట్టి, దివాకర్, బాదామి శివలింగనాయక్, గుగ్గరహట్టి శేఖర్, సుహేల్, అమిత్, ప్రతాప్, శేఖర్, యాదవ్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.


బిసిలహళ్లిలో ప్రచారంలో పాల్గొని ఓట్లు అభ్యర్థిస్తున్న ఆప్ అభ్యర్థి దొడ్డ కేశవరెడ్డి

## మాతృశిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలి

**మొదటి పేజీ తరువాయి...** 24 శిశు మరణాలు, గుండెపోటుతో ఒకరు మృతి మరణం సంభవించగా, ఏ కారణాలతో మాతృశిశు మరణాలు సంభవించాయన్న అంశాలపై ఆరా తీశారు. క్షేత్ర స్థాయి సిబ్బంది అనునిత్యం అందుబాటులో ఉంటూ గర్భిణీలు, బాలింతలు, శిశువులకు సంబంధించిన అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని, మరణాలు సంభవించకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం అన్ని విధాల తనవంతు కృషి చేస్తోందని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో రాబోయే 7 రోజులలో మన జిల్లా ముందు వరుసలో ఉండాలని, అందుకు సిబ్బందికృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం కూడా ఒకటని, గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం చేపట్టాలని, తెలిపారు. సంబంధిత సూపర్‌వైజర్లు, సిడిపిఓలు ప్రతి రోజూ రెండు అంగన్ వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, వారు నిర్వహిస్తున్న బెన్ఫిషరీ ఔట్‌రీచ్ సర్వేలో అనీమియాతో బాధపడుతున్న 5 సంవత్సరాల పిల్లలు, కౌమారదశలో అమ్మాయిలు, 10 నుండి 19 సంవత్సరాల వారు, 15 నుండి 49 సంవత్సరాల మధ్య గల గర్భిణీలు, స్టంటెండ్ పిల్లలు, ఎదుగుదల లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి సమాచారంలో తేడా లేకుండా ఒకే సమాచార వ్యవస్థ ఏర్పడేలా సమన్వయంతో కలసి పని చేయాలని సూచించారు. వివిధ సరుకులు, సప్లై విషయంలో కన్సల్ట్ ఏజెన్సీలను సంప్రదించి నాణ్యమైన వాటిని నిలువ చేసుకోవాలని తెలిపారు. సరుకుల విషయంలో ఆలస్యం వహించరాదని, ఏమన్నా సమస్యలు ఉంటే ప్రధాన కార్యాలయానికి నివేదికలు పంపాలని, లేకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. వర్చువల్ విధానం ద్వారా సంబంధింత ఎంపిడిఓలకు అంగన్ వాడీ కేంద్రాల పనితీరుపై జిల్లా కలెక్టర్‌కొన్ని సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య, డిఎంహెచ్ఓ డా.ఎస్.వి.కృష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ ఎం.తిప్పేంద్ర నాయక్, ఐసిడిఎస్ పి.డి.లక్ష్మీకుమారి, డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఓలు, పిహెచ్‌సి డాక్టర్లు, ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

**వైద్యరంగం అంశాలలో పురోగతి మెరుగుపడాలి :**

వైద్యరంగంలోని అంశాలలో పురోగతి మెరుగుపడాల్సిన అవసరం ఉందని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు వైద్యఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే పిహెచ్‌సి డాక్టర్లు, వైద్య సిబ్బంది నాణ్యమైన వైద్యసేవలను ప్రజలకు అందించాలని ఆదేశించారు. డిఎంహెచ్ఓ క్షేత్రస్థాయిలో పర్యటించాలని, డిప్యూటీ డిఎంహెచ్ఓ, వివిధ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎప్పటికప్పుడు సంబంధిత ఎంపిడిఓలతోనూ, వైద్యశాఖలో వివిధ సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించుకోవాలని తెలిపారు. సోమవారం లోపు అందరూ ఎంపిడిఓల సహకారంతో డాక్టర్లు సీజనల్, నాన్‌సీజనల్ వ్యాధులపై సర్వే కార్యక్రమం అమలుపై సచివాలయ సిబ్బందితో సమీక్షించి నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. సస్పెక్టెడ్ కేసులను పరిశీలించి ఎంఓ యాప్ నందు అప్‌లోడ్ చేయాల న్నారు. ప్రతి రోజూ ఆర్‌సిహెచ్ పోర్టల్‌ను సందర్శించి ఏ ఒక్కటీ పెండింగ్ లేకుండా మధ్యాహ్నం 1:00 గంటకు క్లియర్ చేయాలన్నారు. ఎఎన్‌సి-టెస్ట్ పెండింగ్ లేకుండా చేయాలన్నారు. ఇంటింటా ఎఎన్ఎంలు చేసే సర్వే రిపోర్ట్‌లను డిఎంహెచ్ ఆధ్వర్యంలో తనకు నివేదికలు అందించాలన్నారు. వివిద ప్రామాణికులలో ప్రాథమికక ఆరోగ్య కేంద్రాలు కనగానపల్లి, లేపాక్షి, చిలమత్తూరు దుర్గానగర్, కదిరేపల్లి, మడకశిర వెనుకబడి ఉన్నాయని, వాటిని 15 రోజులలోపు 90% పూర్తీచేయాలన్నారు. వారంలోపు ఎన్ఎస్.కే గట్, కొండాపురం,రెడ్డిపల్లి, అగళి, పరిగి, తాడిమర్రి, కొక్కంటి, సిడిఎన్‌సిడి సర్వే నమోదు ప్రక్రియ 90% పూర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓలు, డాక్టర్‌నివేదిత, డాక్టర్ మంజువాణి, డాక్టర్ కల్పనాసాల్మన్, డాక్టర్ అల్లావుద్దీన్, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెన్నహోబిళ క్షేత్రంలో ఘోర అపరాదం..!



మొదటి పేజీ తరువాయి... వివరాల్లోకి వెళితే... విజయనగర సామ్రాజ్యాధీశులైన సదాశివరాయలు పెన్నహోబిళంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తుండగా ఆరు శతాబ్దాల క్రితం 1428లో శ్రీవారి రథంను తయారు చేయించి నాటి నుండి ప్రతి ఏడాది వైశాఖ శుద్ధ పంచమి రోజున రథోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే రథం తయారు చేయబడి 600 సంవత్సరాలు పూర్తీకాగా కాలక్రమేనా ఇటీవల శిధిలమవుతూ వచ్చింది. దీంతో గతంలో ఆలయానికి కార్యనిర్వహణ అధికారులుగా పనిచేసిన వారు కొత్త రథాన్ని తయారు చేయించాలని సంకల్పించి ఇందుకు 1.4 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని ఇందులో 70 లక్షల రూపాయలను భక్తుల నుండి విరాళాలుగా మరో 70 లక్షల రూపాయలను ఆలయ నిధులు వినియోగించుకునేలా కార్యచరణ రూపొందించి విరాళాల సేకరణను మూడేళ్ళ క్రితం ప్రారంభించారు. అయితే అనుకున్న లక్ష్యం మేరకు భక్తుల నుండి విరాళాలు సమకూరినా రథం తయారీ మాత్రం ఆలయంలో అంతర్గత కుమ్ములాటలు, ఈఓల బదిలీలు, వివిధ రాజకీయ కారణాలతో కార్యరూపం దాల్చలేదు. ఈక్రమంలోనే పాత రథానికే మరమ్మతులు చేయిస్తూ ఉత్సవాలను మమా అనిపిస్తూ వస్తున్నారు. ఇదివరకటి కంటే రథం ఇప్పుడు మరింత దెబ్బతిందని మరమ్మతులు చేసినా రథం లాగడం అంత శ్రేయస్కరం కాదని ఎద్దైనా ప్రమాదం జరుగవచ్చని పరిశీలకులు, భక్తులు పదేపదే చెబుతున్నా ఆలయ అధికారులు మా మాటలు పెడచెవిన పెడుతూ ఏకపక్షంగా వ్యవహరించి మరో రెండు రోజుల్లో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమకానున్న నేపధ్యంలో హడావుడిగా రథం మరమ్మతులు చేపట్టి చెదలుపట్టి పూర్తీగా శిధిలమైన రథానికి కొత్త చక్రాలను బిగించేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టి రథం కూలిపోయిందని భక్తులు మండిపడుతున్నారు. నూతన రథం తయారీకు భక్తుల నుండి విరాళాలు సేకరిస్తున్న అధికారులు నూతన రథం తయారీకు చర్యలు చేపట్టకుండా పాత రథానికే వద్దంటున్నా మరమ్మతులు చేయించిన ఫలితంగా ఘోర అపచారం జరిగిందని ఇది ముమ్మాటికీ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమేనని మండిపడుతున్నారు. నేటికీ రథం తయారీ పేరుతో వేలు, లక్షల రూపాయలు విరాళాల సేకరణ కొనసాగుతూనే ఉన్నాయని ఆ డబ్బుకు సరైన జవాబుదారీ, లెక్కలు కూడా లేవని వాపోతున్నారు. లక్షల, కోట్లాది మంది భక్తులు ఇంటి ఇలవేల్పుగా కొలిచే శ్రీ లక్ష్మీనరసింహుడు ఆగ్రహించడానికి ఆలయంలో జరుగుతున్న అనైతిక వ్యవహారాలే కారణమంటున్నారు.

**ఆలయ కార్యనిర్వహణ అధికారి ఏమన్నారంటే..**

రథం మరమ్మతుల సమయంలో కూలిపోవడంపై ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ వివరణ ఇచ్చారు. రథం మధ్యలోని పూర్తీగా పాడైన రెండు చక్రాలను తొలగించి కొత్త చక్రాలను బిగిస్తున్న తరుణంగా రథచక్రాల ఇరుసు విరిగిపోయి రథం కూలిపోయిందని అన్నారు. అయితే మే 2వ తేదీ నుండి బ్రహ్మోత్సవాలు యధాతథంగా కొనసాగుతాయన్నారు. ఆగమశాస్త్ర పండితుల సలహాలు, సూచనలను తీసుకొని ఇదివరకే ఎక్కడైనా తయారు చేయబడివున్న రథాన్ని తెచ్చి రథోత్సవం నిర్వహించడమో లేక వాహహోత్సవాల రథంలోనే ఉత్సవమూర్తులను ఉంచి రథోత్సవాన్ని నిర్వహించడమో జరుగుతుందని అన్నారు. నూతన రథం ప్రక్రియ ఎందుకు ప్రారంభం కాలేదని ప్రశ్నించగా ఇప్పటిదాకా భక్తుల నుండి 78.69 లక్షలు విరాళాల రూపంలో అందాయని అయితే రథం తయారీకు కీలకమైన ఒక్క కలప మాత్రమే 1.4 కోట్ల రూపాయలు అవుతుందని కలప సమకూరిన తరువాత టెండట్లు పిలుస్తామన్నారు. ఇదివరకు రథం తయారీకు 1.4 కోట్ల రూపాయలు అంచనాలు ఉండగా ఇప్పుడు అది 2.75 కోట్లకు చేరిందని వివరించారు.

## కాంగ్రెస్‌కు గ్యారెంటీ లేదు....
### - గ్యారెంటీ యోజనల జారీ జరగదు
### - బళ్లారి రోడ్‌షోలో ముఖ్యమంత్రి బసవరాజబొమ్మై


నగరంలో రోడ్‌షోలో పాల్గొని ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి బసవరాజబొమ్మై, చిత్రంలో బీజేపీ అభ్యర్థి గాలి సోమశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు మురహరగౌడలు ఉన్నారు.

**బళ్లారి, ఏప్రిల్29, ప్రభాతవార్త ;** ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఉచిత తాయిళాలు ధారాళంగా ప్రకటిస్తున్నదని, గ్యారెంటీ యోజనల పేరిట ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, అసలు కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో గ్యారెంటీలేదని, ఇక ఆ పార్టీ తీసుకొచ్చే గ్యారెంటీ యోజనలకు ఏమి గ్యారెంటీ అని రాష్ట్ర ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై వ్యంగ్య ధోరణితో విమర్శించారు. నగరంలో రోడ్‌షో జరిపిన సీఎం బసవరాజబొమ్మై స్థానిక బ్రూస్పేట పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్‌వారు పగటి కల కంటున్నారని, వారు అనుకుంటున్నట్లుగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే అవకాశాలు లేవు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా నిర్యాణమవు తుందని ఆరోపించారు. శుక్రవారంనాడు రాహుల్‌గాంధీ బళ్లారిలో రోడ్‌షో చేసి బళ్లారిలో జీన్స్ రాజధాని చేస్తామని చెప్పారు. మీ తల్లిగారు సోనియాగాంధీ బళ్లారి ఎంపీగా ఎన్నికైనప్పుడు ఇచ్చిన రూ.3,300 కోట్ల ప్యాకేజీ ఏమయ్యిందని ప్రశ్నించారు. ఇప్పటికే బడ్జెట్‌లో బళ్లారిలో జీన్స్ పార్కు స్థాపనకు రూ.50 కోట్లు కేటాయించామని తెలిపిన ఆయన, మీ హామీల ఆవశ్యకత బళ్లారి ప్రజలకు లేదని, రాహుల్ వ్యాఖ్యకు సమాధానమి చ్చారు. జనం, డబ్బు మధ్య ఇక్కడ ఎన్నికలు జరుగుతాయి. అయినా ప్రతిసారీ ఇక్కడ ప్రజా బలమే గెలుస్తుందని చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పెంపు ఆచరణలోకి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని లేనిపక్షంలో రిజర్వేషన్ పెంపును తొలగించి వేస్తామని కాంగ్రెస్ చెబుతున్నదని, ప్రజలు దీనిని అర్థం చేసుకొని జాగ్రత్తగా ఓటువేయాలని చెప్పారు. జిల్లాలో మైనింగ్ కార్యకలాపాల వ్యవహారాలకు సంబంధించి శుల్కం కేఎంఆర్‌సీ నిధుల నుంచి రూ.25 కోట్ల నిధులను బళ్లారి, హొస్పేట, చిత్రదుర్గ, తుమ్మకూరు జిల్లాలకు వినియోగించేందుకు చర్యలు తీసుకున్నట్లు, వచ్చే సంవత్సరం వ్యవధిలో బళ్లారి నూతన విమానాశ్రయం ప్రారంభం కానున్నదని చెప్పారు. బళ్లారి ఎన్నికలు అత్యంత ప్రాధాన్యమైనవని, గత 23 సంవత్సరాలుగా సోమశేఖర్‌రెడ్డి నగరప్రజలకు సేవలు అందిస్తూ ఉన్నారని, బళ్లారి అభివృద్ధిలో ఆయన పాత్ర మహత్తరమైనదని పేర్కొన్నారు. కర్ణాటకలో శ్రీరామభక్తుడైన ఆంజనేయుడి జన్మస్థలమైన అంజనాద్రి పర్వతం పర్యాటక స్థలంగా అభివృద్ధి చేసేందుకు రూ.120 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. గాలి సోమశేఖర్‌రెడ్డి ఈ నేపథ్యంలో ఎంతగానో కృషి చేశారని చెప్పారు. ఎవరి నుంచి అయితే అభివృద్ధి జరుగుతుందో అటువంటి వ్యక్తికి ఓటు వేయాలని తెలిపిన ఆయన, గాలి సోమశేఖర్‌రెడ్డి ఇన్నేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి పనులు చూసి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గోనాళ్ మురహరగౌడ, జౌళి అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు గుత్తిగనూరు విరుపాక్షగౌడ, బళ్లారి ఎంపీ వై.దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

## బళ్లారిలో రోడ్‌షోలో పాల్గొన్న మధ్యప్రదేశ్ సీఎం


కౌల్‌బజార్‌లో బీజేపీ అభ్యర్థి గాలి సోమశేఖర్‌రెడ్డి పరంగా రోడ్ షోలో పాల్గొన్న మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్‌చవాన్

**బళ్లారి, ఏప్రిల్29, ప్రభాతవార్త ;** కర్ణాటక విధానసభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థులపర ంగా ప్రచారం చేసేందుకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చవాణ్ శనివారం నాడు బళ్లారికి చేరుకున్నా రు. స్థానిక బీజేపీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన కౌల్‌బజార్ ప్రాంతంలో బళ్లారి రూరల్ క్షేత్రం పరిధిలోని కౌల్‌బజార్ ప్రాంతంలో రోడ్‌షోలో పాల్గొన్నారు. కూనీటానా మసీదు నుంచి రోడ్ షో ప్రారంభించిన శివరాజ్‌సింగ్ చవాన్ కౌల్‌బజార్ ప్రాంతంలో మెయిన్ రోడ్డులో టాపులేని వాహనంలో సంచరిస్తూ ప్రజలకు అభివాదం చేశారు. రూరల్ క్షేత్రం బీజేపీ అభ్యర్థి బి.శ్రీరాములుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వాహనంకు అమర్చిన మైకులో ప్రసంగించిన ఆయన, డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఒక్క బీజేపీ నుంచి మాత్రమే సాధ్యమవుతుందని, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వ పాలన ఉంటే అభివృద్ధి పనులు సక్రమంగా, వేగవంతంగా జరుగుతాయని, అలాగే జనపర యోజనల ప్రయోజనం కూడా లబ్ధిదారులకు త్వరితగతిన చేరుతుందని, బీజేపీకి ఓటు వేసి రాష్ట్రంలో తిరిగి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంలో మాజీ ఎంపీలు జి.శాంత, సన్నపక్కీరప్ప, గుజిరి అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## గాలి జనార్ధన్‌రెడ్డి అభివృద్ధి కార్యాలను కొనసాగించేందుకు మద్దతునివ్వండి
### - కేఆర్‌పీపీ అభ్యర్థి గాలి లక్ష్మీఅరుణ విజ్ఞప్తి


15వ వార్డు ప్రజలతో కలిసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్న కేఆర్‌పీపీ అభ్యర్థి గాలి లక్ష్మీఅరుణ

**బళ్లారి, ఏప్రిల్29, ప్రభాతవార్త ;** బళ్లారి నగరం సర్వతోముఖాభివృద్ధికి గాలి జనార్దన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యాలను కొనసాగించేందుకు తనకు మద్దతునిచ్చి గెలిపించాలని కేఆర్‌పీపీ అభ్యర్థి గాలి లక్ష్మీఅరుణ తెలిపారు. నగరంలోని 15వ వార్డు పరిధలోని కాటేగుడ్డ, వడ్డెరబండ, ఇలాహీస్ట్రీట్, కేసీ రోడ్డు ప్రాంతాల్లో గడపగడపకు వెళ్లి ప్రచారం చేసిన సందర్భంలో ఆమె మాట్లాడారు. బళ్లారి నగరమంతా తాను సంచరించినట్లు, వెళ్లిన ప్రతీచోట సమస్యల హారాలు వేస్తున్నారని, సాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు నగరంలో పేరుకుపోయాయని, ప్రజల నుంచి తానంతా సమస్యలు ఆలకించినట్లు తెలిపిన ఆమె, బళ్లారి నగరాన్ని అభివృద్ధి వైపు నడిపించేందుకు తనను ఆశీర్వదించాలని కోరారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికే పర్యటించి ప్రజల ప్రేమాభిమానాలు పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంలో మహిళా విభాగం అధ్యక్షులు హంపీరమణ, మల్లికార్జున ఆచార్, పార్టీ నాయకులు మెహఫూజ్ ఆలీఖాన్, రూప, రాజేశ్వరి, గీతారామ్, పుష్పలత, రాముడు, ఇమ్రాన్, ఉల్లాస్, శరత్, రాము, ఇషాక్, మధు, ఆయాజ్, శ్రీనివాస్, సుశీల, పద్మ, రేఖ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏ కళకైనా, కళాకారుడికైనా ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది

-లలిత కళాపరిషత్ కార్యదర్శి పద్మజ



కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిషత్ కార్యదర్శి పద్మజ

అనంతపురం ఓల్డ్‌టౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

ఏ కళకైనా, కళాకారుడికైనా ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని లలిత కళాపరిషత్ కార్యదర్శి పద్మజ అన్నారు. నగరంలోని లలిత కళాపరిషత్‌లో అనంతపురం జిల్లా డ్యాన్స్ మాస్టర్స్ డ్యాన్సర్లతో డ్యాన్ నైట్ కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో కళాకారులకు కొదవలేదన్నారు. ఇలాంటి వారిని కలిపే అదృష్టం లలిత కళాపరిషత్‌కు దక్కిందన్నారు. ఈ ఏడాది ఆణిముత్యం అవార్డు అందుకున్న నగరానికి చెందిన డ్యాన్స్ మాస్టర్ కత్తి విజయ్‌కుమార్‌ను ఈ సందర్భంగా సన్మానించారు. గత నెలలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ పరిషత్ అవార్డును అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని లలిత కళాపరిషత్ కార్యదర్శి పద్మజను కళాకారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డ్యాన్స్ మాస్టర్లు వన్నూర్, కత్తి విజయ్‌కుమార్, విష్ణు, రవికుమార్, బన్నీ ఇమ్రాన్, సీనియర్ కళాకారులు సోమిరెడ్డి, రామగోవిందు, ఆర్వి ప్రసాద్, అస్లాంబాష, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పర్యటించిన జె.సి అశ్మిత్‌రెడ్డి



గ్రామంలో పర్యటిస్తున్న జె.సి అశ్మిత్‌రెడ్డి

యాడికి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

మండలంలని భోగాలకట్ట, నగరూరు గ్రామాల్లో తెలుగుదేశంపార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డి శనివారం పర్యటించారు. గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటూ, కుటుంబయోగక్షేమలు తెలుసుకుంటూ నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లోని ప్రజలు ఎక్కువగా వ్యవసాయ సమస్యలపై ప్రస్తావించారు. నకిలీ విత్తనాలు, వైరస్ సమస్యలతో పంటల దిగుబడి తగ్గిపోయిందని తెలిపారు. భోగాలకట్టలో మాజీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డిని పరామర్శించారు. నగరూరులో ఎస్‌సి కాలనీలో రహదారి సమస్య గత 8 సంవత్సరాలుగా వుందని ఎవరూ పరిష్కరించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి ప్రభుత్వం వచ్చాక రహదారి సమస్యను పరిష్కరిస్తామని ఆయన గ్రామస్తులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, అనంతపురం పార్లమెంటరీ తెలుగుయువత అధ్యక్షులు జగన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు లోకనాథరెడ్డి, పరిమి చరణ్, నాగమునిరెడ్డి, తాండ్ర విక్రమ్, రాజశేఖర్, రవికుమార్‌రెడ్డి, త్రినాథ్‌రెడ్డి, దేవంద్ర, రామునాయక్, దడియాల ఆది, బొట్టు శేఖర్, మధురాజు, నగరూరు నరసింహులు, వేణు, వెంకటరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, కోడూరు నీలకంఠారెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఆది, రాముడు, విజయ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

## జెఇఇ మెయిన్స్‌లో చరణ్‌కు 2692వ ర్యాంకు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

శనివారం విడుదలైన జెఇఇ మెయిన్స్-2023 ఇంజినీరింగ్ ఫలితాలలో కార్పోరేట్ కాలేజీలకు ధీటుగా బి.చరణ్ (హెచ్‌టి నెంబర్ 230310060343) అనే విద్యార్థి 98.98 పర్సంటైల్ జాతీయ స్థాయిలో 2692వ ర్యాంకు సాధించి శ్రీవిజన్ కళాశాల టాపర్‌గా నిలిచారు. అదే విధంగా మరో 8 మంది విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్ సాధించారు. మొత్తం 9.4 లక్షల మంది విద్యార్థుల్తీ పరీక్షకు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఇంతటి ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, కళాశాల సిబ్బందిని, ప్రన్సిపాల్ ఎ.శంకరయ్య, బి.కొండప్ప అభినందించారు.

## లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

యాడికి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

మండలంలోని రాయలచెరువు గ్రామంలోని లీలావతి వృదాశ్రమంలోని వృద్ధులకు శనివారం సిద్దవటం శ్రీరామరెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలనారాయణరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, వృద్ధులు పాల్గొన్నారు.

## మాదిగలను అణగదొక్కాలని చూస్తే ఆలూరు సాంబశివారెడ్డికి రాజకీయ సమాధి కడతాం

- ఏపి ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త



మాట్లాడుతున్న ఏపి ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు

మాదిగ సామాజిక వర్గానికి చెందినటువంటి వ్యక్తి చామలూరు రాజ గోపాల్‌ని 26వ తేదిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా దీవెన అనే కార్యక్రమానికి నార్పల మండలానికి వచ్చినప్పుడు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజగోపాల్‌ని పోలీసులు ద్వారా పక్కకి నెట్టి వేశారు. మాదిగ సామాజిక చెందిన రాజగోపాల్ చాలా అవమానానికి గురి చేయడం మీ రాజకీయ భవిష్యత్తుకే ప్రమాదకరం గుర్తు పెట్టుకో ఆలూరి సాంబశివారెడ్డి అని హెచ్చరించడం జరిగింది. చామలూరు రాజగోపాల్‌కి వెంటనే క్షమాపణ చెప్పకపోతే శింగనమల నియోజకవర్గంలోని మాదిగలంతా ఏకం చేసి సాంబశివారెడ్డికి రాజకీయ సమాధి కడతామని హెచ్చరించారు. ఎస్సీలను అడ్డుపెట్టుకుని రాజకీయ పెత్తనం చాలా ఇస్తూ పబ్బం గడుపుకుంటున్న సాంబశివారెడ్డి ఇదే మా హెచ్చరిక మాదిగలను తక్కువ చూపు చూస్తే నియోజకవర్గంలో మిమ్మల్ని అడుగడుగునా అడ్డుకుని తీరుతామని వారు తెలిపారు. అలాగే టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రావణజని కాదని అగ్రవర్ణాల వారికి హ్యూమన్ కమిటీ ఏర్పాటు చేసి మాదిగల అనగదొక్కే ప్రయత్నం మానుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఏపి ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేసి తీరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జెన్నే చిరంజీవి, రాష్ట్ర కార్దయర్శి సాకే ఓబులేష్, రాయలసీమ జిల్లాల అధ్యక్షులు మీనుగుల రామాంజినేయులు, జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు హణుమంతు, జిల్లా మున్సిపల్ వర్కర్ యూనియన్ ప్రెసిడెంట్ అజయ్‌బాబు, జిల్లా అధికార ప్రతినిధి మంత్రి సుదర్శన్ జిల్లా ప్రధాన కార్యదర్శిల బాల నాగేంద్ర యువసేన జిల్లా ప్రధాన కార్దయర్శి రాళ్లపల్లి చంద్రశేఖర్ రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షులు తూముచెర్ల సాకే నరసింహులు, జిల్లా నాయకులు మురళీ బుజ్జన్న మదిగిరి మండలం రాఘవేంద్ర మరూరు వంశీ కృష్ణబాబు అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ, ఏసి

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

ఉమ్మడి అనంతపురం జిల్లాలో జవహర్ నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష శనివారం 42 పరీక్ష కేంద్రాల్లో జరిగింది. ఈ పరీక్షకు 8774 మంది విద్యార్థులకుగాను 76 21 మంది హాజరయ్యారు. మిగిలిన విద్యార్థులు గైర్హాజరయ్యారు. అనంతరం డీఈఓ ఎం.సాయిరామ్, ఏసి గోవిందనాయక్ కలిసి నగరంలో పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

**మధ్యాహ్న భోజనం తనిఖీ :** అనంతపురం డీఈఓ ఎం.సాయిరామ్ నగరంలోని ఎస్ఎస్ బిఎన్ హైస్కూల్‌లో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఇస్కాన్ ద్వారా సరఫరా అవుతున్న భోజనం నాణ్యత ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా అ స్కూల్‌లో జరుగుతున్న పిటిఏ మీటింగ్‌కి డిఇఓ హాజరై సలహాలు సూచనలు ఇచ్చారు.

## మా విశ్వాసం నువ్వే జగన్

--జెడ్‌పివైస్‌చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ

నార్పల రూరల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

మా విశ్వాసం నువ్వే జగన్ అని జెడ్‌పివైస్‌చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ పేర్కొన్నారు. ఈ నెల 26న నార్పలలో జరిగిన జగనన్న వసతి దీవెన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని పథకాన్ని ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. బడుగు, బలహీనవర్గాలకు చెందినటువంటి తమకు రిజర్వేషన్లు కల్పించి రాజకీయంగా ఇంతటి గుర్తింపు కల్పించినందుకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నా మన్నారు. జగనన్న వసతిదీవెన పథకం ద్వారా వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు బాగా చదువుకుని మంచి ఉన్నత స్థాయిలో నిలబెట్టే ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అదేవిధంగా కష్టసుఖాల్లో మా వెన్నంటే వుండి వర్గబేదం లేకుండా మమ్ములను మంచి స్థాయిలో నిలబెట్టిన నార్పల సత్యనారాయణరెడ్డికి వందనాలు తెలియచేస్తున్నామన్నారు. అదే విధంగా శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహా దారులు ఆలూరు సాంబశివారెడ్డికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సాయికుమార్



సాయికుమార్

రాప్తాడు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని స్థానిక మోడల్ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్న కె.సాయికుమార్ శనివారం మండల పరిధిలోనే ఆర్డిటి స్టేడియంలో జరిగిన సెలక్షన్స్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం జరిగిందని, అన్నమయ్య జిల్లాలో 26 నుంచి 28 వరకు జరిగే పదవ జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ సి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పద్మజా దేవి, పిడి బాలకొండ మల్లికార్జున తెలిపారు.

## తృటిలో తప్పిన ప్రమాదం

అమడగూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

మండలంలోని కంచరవాండ్లపల్లి సమీపంలో శనివారం వేరుశనగపప్పు లారీ అదుపుతప్పి బోల్తాపడింది. అయితే అందులో డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వేరుశనగ పొట్టు లారీ మహమ్మదాబాద్ క్రాస్ నుండి కొక్కంటి క్రాస్‌కు వెళుతున్నట్లు డ్రైవర్ తెలిపాడు. వేరుశనగ పొట్టు లోడు ఒక పక్కకు ఒరగడంతో లారీ బోల్తా పడిందన్నారు. ఈ సంఘటనలో ఎవరికి గాయాలు కాలేదని ఆయన తెలిపారు.



లారీ కిందపడిన దృశ్యం

## రాహుల్ గాంధీపై అనర్హత వేటుని రద్దు చేయాలి

అనంతపురం,క్లాక్‌టవర్ ఏప్రిల్ 29,ప్రభాతవార్త



అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

జాతీయ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మెన్ సాకే శంకర్ విచ్చేసిన సందర్భంగా జిల్లా అధ్యక్షులు బండ్లపల్లి ప్రతాప రెడ్డి,రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు దాదా గాంధీలు స్వాగతం పలుకుతూ ఘనంగా సన్మానం చేయడం జరిగినది. రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మెన్ సాకే శంకర్ గారు మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మెన్‌గా నియమించిన రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు,మాజి పీసీసీ అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజానాథ్ మరియు రఘువీరరెడ్డి, జాతీయ కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ కొప్పల రాజుకు కృతజ్ఞతలు తెలుపుతూ నాకు ఇచ్చిన ఈ పదవి కాంగ్రెస్ పార్టీ అధివృద్ధి కొరకు తోడ్పడుతానన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మరియు బాబు జగ్జీవ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ నాయకులు రాహుల్ గాంధీ పార్లమెంటు లోకసభలో మాట్లాడుతూ నరేంద్ర మోడీని ప్రశ్నించి నందుకు పార్లమెంటు నుంచి సస్పెండ్ చేయడం జరిగింది. 55సంవత్సరాలు ఈ భారతదేశాన్ని కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని,9సంవత్సరాల్లోనే అభివృద్ధి చేయకుండ దేశాన్ని నాశనం చేసిన ప్రధాని మోడీగారు అన్నారు. రాహుల్ గాంధీ పార్లమెంటు లోకసభలో వేసిని అనర్హత వేటును రద్దు చేయాలని,పెంచిన గ్యాస్,డీజిల్, పెట్రోల్ నిత్యవసర వస్తువులను తగ్గించాలని లేని పక్షంలో దశలవారిగా ఉద్యమ కార్యచరణ చేపడు తుందని తెలిపారు..ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కాపు గాజుల వాసు,రాష్ట్ర అధికార ప్రతినిధి శంకర్ యాదవ్,జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల ఫక్రుద్దీన్,మానవ హక్కుల సంఘం జిల్లా అధ్య క్షులు మాసాల రవి,ఓబీసీ జిల్లా అధ్యక్షులు రామ్ చరణ్ యాదవ్, తాడిపత్రి సమన్వయ కమిటి సభ్యాలు నజీర్,జిల్లా రైతా విభాగం అధ్యక్షులు కృష్ణ, ఉరవకొండ సమన్వయ కమిటి సభ్యాలు అబ్బాస్,సోని శీన, ఓబులేష్ ,చేన్నప్ప,అమర్,వడ్ల అంజనేయులు,ఎస్సీ మహిళ జిల్లా అధ్యక్షురాలు కవిత,నిర్మల,ఎన్.ఎస్.యు.ఐ నాయకులు నరేష్,ఎఖ్కె ప్రసాద్, రాయదుర్గం సమన్వయ కమిటి సభ్యాలు కోరి నాగరాజు, రాప్తాడు నాయకులు భోగినేపల్లి గోవిందు,వేంకటేష్,ముత్యాలు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్కేయూలో పదవీ విరమణ కార్యక్రమం



ఎస్కేయూలో పదవీ విరమణ దృశ్యం

ఎస్కే.యూ,ఏప్రిల్ 28,ప్రభాతవార్త

ఎస్కేయూ లోని భువన విజయం ఆడిటోరియం నందు టిచింగ్ స్టాఫ్ అచార్య ఎస్.వి.పుల్లారెడ్డి(న్యాయశాస్త్ర విభాగం)పదవీ విమరణ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ పుల్లారెడ్డి ఎస్కేయూ నందు 33 సంవత్సరాలు విశేషమైన సేవలు అందించారని కొనియాడారు. అంతేకాకుండ పలువురు బోధన మరియు బోధనేతర సిబ్బంది పుల్లారెడ్డి గురించి మాట్లాడుతూ ఈయన చాల మృదు స్వభావి,స్నూహశీలి అని ఎస్కేయూలో అంకితభావంతో పలురకాలైన పదవుల ద్వారా తన వంతు కృషిని యూనివర్సిటి పురోగవృద్ధికి ఎంతగానో దోహద పడిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్కేయూ రిజిస్ట్రార్ అచార్య అక్కయ్య,సైన్స్ మరియు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్స్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్స్,బోధన మరియు బోదనేతర సిబ్బంది,రిసర్చ్ స్కాలర్స్, విద్యార్థులు,పి.ఆర్.ఓ డాక్టర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

## గ్రూప్ I, 2, మెగా డిఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న మంజునాథ్

రాప్తాడు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న రెండు లక్షల 30వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగళ్ల కాలంలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో చెపా ఓపలని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోషియేషన్ నాయకులు మంజునాథ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జరిగిన ఐసా కార్యక్రమంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇదిగో డిఎస్సీ అదిగో డిఎస్సీ మెగా డిఎస్సీ అంటూ ప్రతిసారి ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఖాళీగా ఉన్నటువంటి పార్లమెంట్‌లో చెప్పి 50వేల ఖాళీ ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఉపాధ్యాయ అధ్యాపక గ్రూప్ 1, 2తో పాటు వివిధ శాఖలలో ఖాళీ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

## మోక్షిత్ పాఠశాలలో అమ్మకు వందనం కార్యక్రమం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

స్థానిక విన్సెంట్ ఫెర్రర్ నగర్‌లోని మోక్షిత్ పాఠశాలలో అమ్మకు వందనం కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు వై.లక్ష్మిసుబ్బారెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మొదటి నుంచి 5వ తరగతి గల విద్యార్థులు వారి తల్లులకు పాదపూజ చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం-అమ్మయొక్క గొప్పదనాన్ని, తల్లిదండ్రుల విలువలను తెలియజేస్తూ వారికి మనము ఎంత రుణపడి ఉండాలి, ఎలాగ వారితో మెలగాలి అని తెలిజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి క్లాస్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొని విజయవంతం చేశారు.

నకిలీ పురుగు మందులు కాలం చెల్లిన మందులను విక్రయిస్తే

## కఠిన చర్యలు తప్పవు



రికార్డులను తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

బుక్కరాయసముద్రం ఏప్రిల్ 29 ప్రభాతవార్త

రైతులకు నకిలీ పురుగు మందులు కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఏడిఏ వెంకటరాముడు హెచ్చరించారు.శనివారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ధాన్యరాసి రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంస్థను ఆకస్మికంగా తనిఖీచేశారు.ఈ తనిఖీలో భాగంగా పలురికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగ వారు మాట్లడుతు కొత్త ఆర్థిక సంవత్సరం మొదలైంది రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు.షాఫ్‌ల్లో నకిలీ పురుగు మందులు కాలం చెల్లిన మందులను విక్రయించరాదన్నారు. అట్లు చేసిన ఎడల నిత్యవసరచట్టం కింద కేసు నమోదు చేసి షాఫ్‌ను సీజ్‌చేస్తామన్నారు.నిన్న కురిసిన వర్షాలకు పంటనష్టపోయిన రైతులు ఎవరైనా ఉంటే రైతుభరోసా కేంద్రంలో తెలియజేయాలన్నారు.మండలంలో ఇకెవైసి చేయించుకోనివారు 1919 మంది రైతులు ఉన్నారు.269 మంది ఎన్‌పిసిఐ లింక్ కాని రైతులు ఉన్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఆయనవెంట మండల వ్యవసాయశాఖ అదికారి శ్యామ్‌సుందర్‌రెడ్డి,షాఫ్ యజమాని తిరుపాలు తదితిరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ఉద్యోగికి అండగా దండు



దండు శ్రీనివాసులుని సన్మానిస్తున్న దృశ్యం

శింగనమల, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

మండల పరిధిలోని గుమ్మేపల్లి గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్-2లో హెల్పర్‌గా పని చేస్తున్నటువంటి బెస్త లక్ష్మిదేవి, 3/2/2023లో విధుల నుంచి తొలగించడంతో విషయం తెలుసుకున్న తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు హెల్పర్ బెస్త లక్ష్మిదేవికి తిరిగి ఉద్యోగం తెప్పించేందుకు కృషి చేస్తానని హామీని ఇచ్చి, హైకోర్టుకు వెళ్లి ఆమె విధుల్లో మరల చేరేందుకు నియామక పత్రం తెప్పించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో బెస్త అంకన్న తన కుటుంబానికి అండగా నిలబడినందుకు దండు శ్రీనివాసులును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఆదినారాయణ, బ్యాళ్ల సుదర్శన్, బెస్తనారాయణస్వామి, బెస్త అమర్‌నాథ్, జానగాని శివ, తోట రమేష్, నాగభూషణం పాల్గొన్నారు.

## కేశవానందభారతి కేసు తీర్పుపై సెమినార్

అనంతపురం ఓల్డ్‌టౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

కేశవానందభారతి కేసులో చారిత్రాత్మక సుప్రీంకోర్టు తీర్పు వెలువడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీవిజయనగర న్యాయ కళాశాలలో విద్యార్థులచే సెమినార్ నిర్వహించడం హర్షనీయమని సీనియర్ న్యాయవాది ఎల్‌కె సుదింద్రనాథ్ అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవేంద్రచార్ అధ్యక్షతన ప్రొఫెసర్ జె.సోనీ కార్యక్రమ సంధానకర్తగా శనివారం జరిగిన సెమినార్ ప్రారంభోత్సవ సభలో ఆయన కీలక ఉపన్యాసం చేశారు. అశేష భారతావనికి న్యాయవ్యవస్థపై నమ్మకానికి ఈ తీర్పు ప్రాణం పోసిందన్నారు. 13 మంది న్యాయమూర్తులు బెంచ్ 68 రోజుల పాటు సుదీర్ఘంగా వాదనలు విన్న మీదట 700 పేజీలపైగా భారత రాజ్యాంగం మౌళిక అంశాలపై తీర్పు వెలువరించడంతో పాటు న్యాయవ్యవస్థ అస్తిత్వాన్ని కాపాడడంతో పాటు ప్రజాస్వామ్య పరిరకణక్షలో న్యాయవ్యవస్థ భూమికను స్పష్టం చేసిందని తెలిపారు. ఇటువంటి తీర్పు ఈ 50 సంవత్సరాల్లో తిరిగి పునరావృతం కాలేదన్నారు. కళాశాల విద్యార్థులు గణేష్, మహిమ, ఖాజామొహిద్దిన్, యశ్వంత్‌కుమార్‌లు ప్రసంగించారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ఎం.మహేష్, ఎన్.హరికృష్ణ, నాగరాజు, బాలాజీనాయక్, కళాశాల అధ్యాపకులు, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హెచ్‌ఎంలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఎంపిక కాబడిన 38 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా సైన్స్ సెంటర్‌లో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలోభాగంగా గౌరవ జిల్లా విద్యాశాఖాధికారి యంసాయిరామ్ మాట్లాడుతూ.. పిఎం పాఠశాలలుగా ఎంపిక కాబడిన అందుకు సహకరించిన ప్రధానోపాధ్యాయులకు ప్రశంసించడం జరిగింది. ముఖ్యంగా ఈ పథకం ద్వారా ఎంపిక కాబడిన పాఠశాలలో సకల వసతులు కల్పించడానికి తగిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా అందరూ విదిగా బడ్జెట్ ప్రతిపాదనలను, చాప్టరైజేషన్‌ను నిబంధనల మేరకు తయారు చేసి పిఎం వెబ్‌సైట్‌లో 30వ తేదీలోపుగా పొందుపర్చవలసిందిగా కోరడమైంది. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్స్ అందరూ తమతమ విభాగాలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలు, చాప్టరైజేషన్ ఎలా తయారు చేయాలి, ఎలా ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్న వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎఎంఓ డి.హరికృష్ణ, జిసిడిఓ శాంతాబాయి, అసిస్టెంట్ సెక్టోరల్, ఆర్.మాధవరెడ్డి, హెచ్‌టి తిప్పేస్వామి, ఎఎస్‌ఓ గురుముని కృష్ణ, రవికుమార్, నారాయణస్వామి, ఎం.చంద్రమోహన్‌రెడ్డి, ఎఎస్‌ఓ ఓబుళరెడ్డి, ఎంపిక కాబడిన పిఎంశ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

## రేపటి నుంచి టిటిసి వేసవి శిక్షణ తరగతులు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

టిటిసి-2023 టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ వేసవి శిక్షణ (42) రోజుల కోర్సుకు అనంతపురంలో మే 1 నుంచి జూన్ 11వరకు నిర్వహించబడుతుందని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నాటికి వయస్సు 45 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. టిసిసితోపాటు సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత అర్హత కలిగి ఉండాలి, ఇతర వివరాలకు వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

## నేడే ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ ఎంట్రెన్స్ టెస్ట్

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ టెస్ట్ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ, గురుకుల పాఠశాల (బాలికలు), నవోదయ కాలనీ (ఆపోసిట్ గ్రామ సచివాలయం-43), అనంతపురం 515001, సెల్ నెంబర్ 9948100343, 6305567352కు సంప్రదించాలని తెలియజేశారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా PALLA CHITHAMBARAIAH, S/o PALLA OBANNA, H.No.2/11,YADIKI,ATP నందు నివసిస్తున్నారు. తాడిపత్రి శ్రీరామ్ సిటీ యూనియన్ లిమిటెడ్ తాడిపత్రి బ్రాంచ్ వారు వీరి ప్రాపర్టీని తనఖా పెట్టుకొని రుణం ఇస్తున్నారు. సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైనా ఎటువంటి క్రైమ్‌లు, ఆక్షేపణలు ఉన్న ఎడల నేటి నుండి ఏడు రోజుల లోపు క్రింది చిరునామాకు సంప్రదించగలరు.

SCHEDULE OF IMMOVABLE PROPERTY
This Property holder Name : P.CHITHAMBARAIAH
SY NO: 446 Total: 50.04 Cents
The property is situates in YADIKI with the following particulars.
DOC NO: 958/2023
Schedula - A
PLOT No: 1,4,22 & 22,94,96,98,63 & 72,103,107,112 & 75-A
Total This Plots

C.RAMESHNATH REDDY (Advocate), TADIPATRI

## డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థం.. ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీ వాసులు

- పంచాయితీ అధికారుల నిర్వాకంతో ముదురుతున్న వ్యాధులు





అధ్వానంగా ఉన్న చింతమేకల కాలనీ డ్రైనేజీ

రాప్తాడు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

ఎన్టీఆర్ జిల్లా కెంచికచర్ల కాలవలు పారుదల కాక ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోనే చింతమేకల కాలనీ (రెండవ వార్డు) పలు కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దుర్వాసన దుర్గంధం వెదజల్లుతూ ఉందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలవలు సరిగా లేవని మురుగు నీరు పారుదల సరిగా లేదని పంచాయితీ అధికారులకు ఎ న్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేడని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో శుక్రవారం కురిసన కొద్దిపాటి వర్షానికి కూడా రోడ్లపై వర్షపు నీరు మురుగు నీరు నిలబడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వేసవి కాలంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్లపై నీరు నిలబడుతున్నాయని రాబోయే వర్షాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పలు కాలనీలో మురికి కాలువలు శుభ్రం చేయించి కాలువలు పారుదలయ్యే విధంగా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

04ATP13_04ATP13.qxd 29-04-2023 PM 11:15 Page 1



## ప్రజల సంక్షేమమే జగనన్న ధ్యేయం -ఎమ్మెల్యే


పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 32వవార్డులో శనివారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్య క్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరికి పలకరించారు. నాలుగేళ్ల పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా వచ్చిన మొత్తాన్ని ఎమ్మెల్యే లబ్దిదారులకు వివరించారు. అదేవిధంగా వృద్ధులకు ఫించన్లు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత వుండి పథకాలు అందని వారు ఎవరైనా వుంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వారికి న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే తెలియచేశారు. ఈ కార్య క్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## దేశచరిత్రలో నిలిచిపోయేలా జగనన్న సంక్షేమ పథకాలు

**- జగన్ పాలన పట్ల 1.45 కోట్ల కుటుంబాల మద్దతు - ప్రజా మద్దతు వైఎస్సార్‌సిపిదే - 'జగనన్నే మా భవిష్యత్తు'లో ఎమ్మెల్యే దుద్దుకుంట**


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట

**ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :**

సిఎం జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశచరిత్రలో నిలిచిపోయేలా ఉన్నాయని ప్రజలు అంటున్నారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్తు ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మల్లిమల్లోలపల్లిలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వే రాష్ట్రంలోని 1.45 కోట్ల కుటుంబాలను కలిసి సిఎం జగనన్న పాలనపై వారి అభిప్రాయలను సేకరించిందన్నారు. జగనన్న పాలనపై అపార విశ్వాసం వ్యక్తం చేస్తూ 1.1 కోట్ల కుటుంబాలు మిస్డ్ కాల్ ద్వారా మద్దతు ప్రకటించాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా 1.45 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారన్నారు. అంతే కాకుండా 7 లక్షల మంది గృహసారధులను నియమించి ప్రభుత్వ పాలనలో పారదర్శకతను తీసువచ్చారన్నారు. సంక్షేమం, అభివృద్ధి, యువతకు ఉపాధి, మహిళలకు డా వ్రా రుణమాఫీ, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, జగనన్న అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన తదితర పథకాలు నిరాటంకంగా కొనసాగలంటే 2024లో జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కన్వీనర్లు రాజునాయుడు, కోళ్ల క్రిష్టారెడ్డి, ఎంపిపి తుమ్మల పర్వీన్‌భాను, జడ్పిటిసి కుర్లి దామోదర్‌రెడ్డి, సర్పంచ్ జగన్‌మోహన్‌చౌదరి, ఎంపిటిసి వినోద్‌కుమార్‌రెడ్డి, వైకాపా నాయకులు తుమ్మల షామీర్‌బాష, లక్ష్మిరెడ్డి, రామసుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, ఎద్దుల రంగారెడ్డి, కేశవ, డీలర్ బాబు, చెన్నారెడ్డి, కిష్ట తదితరులు పాల్గొన్నారు.

## జగనన్నే మా భవిష్యత్తుకు అద్భుత స్పందన - ఎమ్మెల్యే


పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

**శింగనమల, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా అద్భుత స్పందన వచ్చిందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో చివరి రోజు పత్రికా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కోట్ల కుటుంబాలను కలిశారని ఎమ్మెల్యే తెలిపారు. 1.10 కోట్ల మిస్డ్ కాల్స్ వచ్చినట్లు, ఇది అద్భుతమైన స్పందన అని తెలిపారు. మన శింగనమల నియోజకవర్గంలో 85 శాతం కుటుంబాలను కలిశామని, జగనన్న పాలనపై ప్రజలు చూపించిన ఆదరాభిమానాలు మరువలేనివన్నా రు. ప్రజా స్వామ్యంలో నూతన ఒరవడి దిద్దిన ఘనత మన జగనన్నకే దక్కుతుందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి నియోజకవర్గంలో ఉన్న సమస్యలకు తప్పక పరిష్కారం చూపుతామన్నారు. రెండో సారి విజయం సాధించిన తర్వాత ప్రతి మారుమూల పల్లెకు రహదారి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో సుమారు 7 లక్షల మంది గృహ సారధులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్ అభిమానులు ఈ యజ్ఞంలో పాల్గొన్నారని, శింగనమల నియోజకవర్గంలో పాల్గొన్న ప్రతి కార్యకర్తకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఈ పత్రికా సమావేశంలో బుక్కరాయ సముద్రం జడ్పిటిసి నీలం భాస్కర్, ఎంపిపి సునీత, బుక్కరాయసముద్రం సర్పంచు పార్వతమ్మ, రైతు సంఘం నాయకులు ఎన్‌వి.నారాయణ, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## 1.45 కోట్ల కుటుంబాలకు వైఎస్ఆర్‌సిపి చేరువ

**- దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ చేయని భారీ మెగా పీపుల్స్ సర్వే**

**- విశేషంగా పాల్గొన్న ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసిన ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్‌నారాయణ**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్ నారాయణ

**పెనుకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

వైఎస్‌ఆర్‌సిపి ప్రతిష్టాత్మక జగనన్నే మా భవిష్యత్తుమెగా పీపుల్స్ సర్వే శనివారం నాటితో రాష్ట్ర వ్యాప్తంగా ముగిసింది. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్‌సిపి రాష్ట్రంలోని 1.45 కోట్ల కుటుంబాలను కలిసి సీఎం జగనన్న పాలనపై వారి అభిప్రాయాలను సేకరించింది. సీఎం జగనన్న పాలనకు 1.1 కోట్ల కుటుంబాలు మిస్డ్ కాల్ ద్వారా మద్దతు ప్రకటించారు. ఈ మెగా సర్వే పూర్తి వివరాలను ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సీఎం జగన్ పాలనపై 80 శాతం ప్రజల సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. జగన్ నాయకత్వం మీద రాష్ట్ర ప్రజలు పూర్తి సంతోషంగా ఉన్నారన్నారు. ఈ సర్వేతో వైఎస్ఆర్‌సిపి రాజకీయంగా బలంగా ఉందని నిరూపణ అయిందన్నారు. ఇలాంటి కార్యక్రమం దేశంలో ఏ రాజకీయ పార్టీ చేపట్టలేదు. 1.45 కోట్ల కుటుంబాల మద్దతుతో ఓ చరిత్ర సృష్టించామన్నారు. గృహ సారథులు, నాయకుల ద్వారా ఈ కార్యక్రమం సంపూర్ణంగా విజయవంతమైందన్నారు. ప్రజలు వారి భవిష్యత్తు కోసం మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజా మద్దతు పుస్తకంలో ప్రశ్నలకు ప్రజల స్వచ్ఛందంగా సమాధానాలు ఇచ్చారు. చంద్రబాబు సంస్కార హీనుడిలా మాట్లాడడం సరికాదు. ఇలాంటి కార్యక్రమం చేసే దమ్ము చంద్రబాబుకి ఉందా.. కులం, మతం అతీతంగా వైసీపీ పాలన చేస్తోంది. ఈ మాట చంద్రబాబు ఒక్కసారైనా తన ప్రభుత్వ హయాంలో ఇలా చెప్పారా అని ఆయన ప్రశ్నించారు. ప్రజా మద్దతు పుస్తకం ద్వారా ప్రజలు అభిప్రాయం చెప్పారు. కులం, మతం చూడకుండా ఓటు వేయని వారికి కూడా లబ్ది చేకూరుతోంది. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజలను ఈ సర్వేలో కలిశాం. చంద్రబాబు లాగా గాల్లో లెక్కలు వైఎస్ఆర్‌సిపి ఎన్నటికీ చెప్పదని ఆయన వివరించారు.

**అజ్ఞాని లోకేష్.. :** బిసిలకు ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు తెలుగుదేశం హయాంలో ఏమి చేసిందో చంద్రబాబు లోకేష్‌లు చెప్పాలని ఎమ్మెల్యే ప్రశ్నించారు. చదువుకున్న అజ్ఞాని లోకేష్ అని బిసిలు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఎవరు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని ఆయన హితవు పలికారు. ఈ సమావేశంలో మండల పార్టీ కన్వీనర్ నాగలూరుబాబు, పట్టణ కన్వీనర్ బోయ నరసింహులు, నగర పంచాయితీ చైర్మన్ ఉమర్ ఫరూక్, వైస్ చైర్మన్ సునీల్, వైస్ ఎంపపి రామాంజినేయులు, శ్యామ్ సుందర్‌నాయక్, కొండలరాయుడు, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మే 10వతేదీలోగా ఆన్‌లైన్‌లో అక్రిడిటేషన్ దరఖాస్తులు సమర్పించాలి

**- నేటి నుండి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ -జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి**



**అనంతపురం కలెక్టరేట్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

మే 10వతేదీలోగా అనంతపురం జిల్లాలోని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా, ఫ్రీలాన్స్, వెటరన్, న్యూస్ ఏజెన్సీ జర్నలిస్టులు నూతన అక్రిడిటేషన్ కొరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా కమిటీచైర్మన్ ఎం.గౌతమి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు సంవత్సరాల వ్యవధితో 2023-24కు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి శనివారం నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల సమాచారశాఖ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో వారికి సంబంధించిన వివరాలను అప్‌లోడ్ చేసుకుని, తదుపరి ప్రింట్ డాక్యుమెంట్ కాపీలు, జత పరిచిన పత్రాలతో పాటు దరఖాస్తు ఒక ప్రతిని అనంతపురం రైతు బజార్ సమీపంలోని అనంత కృషిభవన్‌లో గల సమాచార పౌరసంబంధాలశాఖ డిఐపిఆర్‌ఒ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో జతపరిచిన డాక్యుమెంట్లను పిడిఎఫ్ ఫార్మెట్‌లో, ఫోటో మరియు సిగ్నేచర్‌ను జెపిజి ఫార్మెట్‌లో అప్‌లోడ్ చేయాల్సి వుందన్నారు. పాత్రికేయులు మరియు మీడియా సంస్థలు జత చేయాల్సిన డాక్యుమెంట్ల వివరాలను కూడా ఆన్‌లైన్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు. జిల్లాలోని పాత్రికేయులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మే 10వతేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## బాధిత కుటుంభానికి గోనుగుంట్ల రూ.10వేల ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న గోనుగుంట్ల సూర్యనారాయణ

**ధర్మవరం టౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

కొన్ని రోజుల కిందట కరోనాతో మరణించిన డి.చంద్రశేఖర్ కుటుంబానికి మాజీ ఎంఎల్ఎ గోనుగుంట్ల సూర్యనారాయణ రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. మండల పరిధిలోని ఆర్.యర్రగుంట్లపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ భార్య, పిల్లలు శనివారం గోనుగుంట్లను వ్యక్తిగత కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి నగదు అందజేశారు. ఈ సందర్భంగా బాదిత కుటుంబ సభ్యులు గోనుగుంట్లకు ధన్యవాదాలు తెలిపారు.

## దేవున్ని అడ్డుపెట్టుకొని దోచుకొంటున్నారు..!

**-అన్నదానానికి విరాళాలిస్తే రసీదు కూడా ఇవ్వకుండా అధ్వాన్నంగా అన్నదానం నిర్వహిస్తారా?-శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్‌ను నిలదీసిన దాతలు-దేవాలయంలో అవినీతి, అక్రమాలపై కలెక్టర్, ఏసీబీ, ఉన్నతాధికారులకు పిర్యాదు చేస్తామన్న దాతలు**


ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్‌ను నిలదీస్తున్న భక్తులు

**ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదానం నిర్వహించాలని తాము స్వామి వారిపై ఎంతో భక్తితో విరాళాలు ఇస్తే వాటికి రసీదులు ఇవ్వకుండా తూతూ మంత్రంగా అన్నదానం నిర్వహిస్తూ దేవున్ని అడ్డుపెట్టుకొని దోచుకుతింటారా అంటూ పలువురు భక్తులు శనివారం మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్‌ను నిలదీశారు. రెండు గంటలపాటు ఆలయ కార్య నిర్వహణ అధికారి గదిలోనే బైటాయించి ఆలయంలో విరాళాల సేకరణలో జరుగుతున్న అక్రమాలపై ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఈఓపై మండిపడ్డారు. ఇకపై ఈ దేవాలయానికి ఒక్కపైసా కూడా విరాళం ఇవ్వమని సద్వినియోగంకానిచోట ఎంత విరాళాలు ఇచ్చినా ప్రయోజనంలేదని వాపోయారు. దాతలైన బాధిత భక్తులు తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే...కర్నాటక రాష్ట్రం బళ్లారికు చెందిన అక్కడి జిల్లా కోర్టులో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాఘవేంద్ర కుటుంబం ఈనెల 22వ తేదీన శ్రీవారి దర్శనానికి ఆలయానికి వచ్చి వచ్చే శనివారం 29వ తేదీన తమ పేరుతో భక్తులకు అన్నదానం నిర్వహించాలని ఆలయ కార్యనిర్వహణ అధికారి విజయ్ కుమార్‌కు 15,000 రూపాయలు విరాళం అందించారు. విరాళాన్ని తీసుకున్న ఈఓ కార్యాలయంలో సిబ్బంది ఎవరూ లేరని రసీదు మళ్లీ ఇస్తామని మీ పేరుతో అన్నదానం మాత్రం వచ్చే శనివారం నిర్వహిస్తామని చెప్పడంతో వారు వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే రాఘవేంద్ర శనివారం ఉదయం తన భార్య త్రివేణి, కూమార్తె హొన్నశ్రీతో కలిసి ఆలయానివచ్చి నేరుగా అన్నదాన సత్రానికి వెళ్లారు. ఈరోజు మేమే అన్నదానం చేయిస్తున్నామని ఎంత మందికి ఏమేమి వండుతున్నారని అక్కడి వంటమనుషులను విచారించారు. ప్రతివారం తరహాలోనే వండుతున్నామని ప్రత్యేకత ఏమీలేదని వారు చెప్పడంతో విస్తుపోయారు. అంతలోనే అక్కడికి వచ్చిన అనంతపురంకు చెందిన మరొక భక్తుడు, ప్రైవేటు టీచర్ అశోకవర్ధన్ ఈరోజు అన్నదాన ం మాదని చెప్పడంతో రాఘవేంద్ర కుటుంబం అవాక్కైంది. మేము డబ్బులు కట్టామని చెప్పగా తాను కూడా 15,000 రూపాయలు గత వారం ఈఓకు ఇచ్చానని చెప్పడంతో కోపోద్రిక్తులై వారు కొండపై ఆలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంకు చేరుకొని ఆలయ ఈఓ విజయ్‌కుమార్‌పై మండిపడ్డారు. ఈ క్రమంలోనే పైకివచ్చిన మరో దాత అశోకవర్ధన్ సైతం వారితో స్వరం కలిపి ఈఓను చుట్టుముట్టి ప్రశ్నల వర్షం కురిపించారు. మేమిచ్చిన విరాళాలకు రసీదులు ఇవ్వలేదు సరికదా భక్తులకు మంచి భోజనమైనా పెట్టించారా అంటే అధ్వాన్నమైన భోజనం తయారు చేయించారని మండిపడ్డారు. ఇలా అందిన కాడికి విరాళాలు దిగమింగుతుంటే భక్తులెవరైనా విరాళాలు ఇవ్వడానికి ఎలా ముందుకొస్తారని ప్రశ్నించారు. ఈ ఆలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై జిల్లా కలెక్టర్, దేవాదాయశాఖ కమీషనర్, ఏసీబీ అధికారులకు పిర్యాదు చేయడమేకాకుండా ఇక్కడి తంతుపై తాము చిత్రీకరించిన వీడియోలను సోషల్ మీడియాలో పెడతామని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నాలిక్కర్చుకున్న ఈఓ అప్పటికప్పుడే చిల్లర జమ ఖర్చుల పుస్తకంలో రాఘవేంద్ర పేరుతో విరాళం రసీదు తయారు చేయించి ఇచ్చే ప్రయత్నం చేయగా దాత తీసుకోలేదు. తాము అన్నదానానికి విరాళం ఇచ్చామని అన్నదానం విరాళం పుస్తకంలోనే రసీదు ఇవ్వాలని, మా డబ్బు ఎక్కడ డిపాజిట్ చేశారో చెప్పాలని నిలదీయగా మా వద్ద అన్నదానికి ప్రత్యేకంగా రసీదు పుస్తకం లేదని మీరు అడుగుతున్నారు కాబట్టి రథం తయారీ విరాళాల రసీదు ఇస్తామని ఈఓ ఆ రసీదు ఇవ్వగా మరోమారు ఈ ఆలయానికి ఒక్కపైసా కూడా విరాళమివ్వమని అక్కడి నుండి వారు వెళ్లిపోయారు. మరో భక్తుడు అశోక్‌వర్ధన్ సైతం ఇదేం పద్ధతని ఈఓను ప్రశ్నించగా అక్కడేవున్న మరో భక్తుడు మీ దోపిడిపై ఏసీబీ అధికారులకు పిర్యాదు చేస్తామని చెప్పగా ఈఓ మీరెరెకైనా పిర్యాదు చేసుకోండని చెప్పుకురాగా వారిమధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటు చేసుకొంది. దేవునికి సేవ చేయాలిగాని దేవుని పేరుతో దోపిడి చేయడం దారుణమని సదరు భక్తుడు ఈఓపై మండిపడ్డాడు.

**ఈఓ వివరణ :** ఈ విషయమై ఈఓ కె.విజయ్‌కుమార్ విలేఖరులతో మాట్లాడుతూ గత శనివారం 22వ తేదీన రాఘవేంద్ర, అశోకవర్ధన్‌లు చెరో 15వేల రూపాయల చొప్పున అన్నదానం కోసం విరాళమిచ్చిన మాట వాస్తవమని ఆరోజు కార్యాలయంలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో వారికి రసీదులు ఇవ్వలేదన్నారు. తమవద్ద అన్నదానానికి ప్రత్యేకించి రసీదు పుస్తకంలేదని చిల్లర జమ ఖర్చుల (మిస్లీనియస్) రసీదు పుస్తకంలోనే రసీదులు ఇస్తున్నామన్నారు. విరాళమిచ్చిన వారి పేరు మీద అన్నదానం నిర్వహిస్తామని అంతేతప్ప అన్నదానంలో ఇతరత్రా ప్రత్యేకలు ఉండవన్నారు. అన్నదానం విరాళాలు ఏం చేస్తున్నారని విలేఖరులు ప్రశ్నించగా ఆయన పొంతనలేని సమాధానాలు చెప్పుకొచ్చారు.

## ఇది కాదా అభివృద్ధి.. ఈ అభివృద్ధి ఒక భాగం మాత్రమే..

**- సెల్ఫీ ఛాలెంజ్ చేసిన మాజీ మంత్రి పరిటాల సునీత**



రమనేపల్లి వద్ద గల గోడౌన్‌ను చూపుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత , గంగలకుంటలో మహిళ సమైక్య భవన్ మాజీ మంత్రి పరిటాల సునీత

**రాప్తాడు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

జిల్లాలో సెల్ఫీ ఛాలెంజ్ పర్వం కొనసాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి ప్రస్తుత పాలనలో జరుగుతున్న అభివృద్ధిపై ఇరు పార్టీల నేతలు సవాళ్లు విసురుకుంటున్నారు. తాజాగా రాప్తాడు నియోజకవర్గంలోని మాజీ మంత్రి పరిటాల సునీత సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్మాణాల వద్ద సెల్ఫీ దిగి మీడియాలో పోస్టు చేశారు. 2014-2019 మధ్య తమ ప్రభుత్వం నిర్మించిన 14.50 కోట్ల నా బార్డ్ నిధులతో 20వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నాలుగు గోడౌన్లు నిర్మించడం జరిగిందని అలాగే నియోజకవర్గంలో స్వయం సహాయక సంఘాల మహిళల కోసం మహిళా సమైక్య భవనాలు నిర్మించడం జరిగింది. నియోజకవర్గంలో మేము చేసిన అభివృద్ధి ఒదొక భాగం మాత్రమే అని సెల్ఫీ ఛాలెంజ్ ద్వారా మంత్రి పరిటాల సునీత తెలియజేశారు.

## జిల్లాలోకి మత్తుపదార్థాలు రాకుండా అరికట్టాలి

**- పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టండి - జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు**


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

**శ్రీసత్యసాయి జిల్లా, ఏప్రిల్ 29, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలోకి మత్తు పదార్థాలు రాకుండా అరికట్టేలా నిరంతర అప్రమత్తంగా ఉండాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నివారణ (నార్కోటిక్ డ్రగ్స్, సైకొట్రోపిక్ పదార్థాలు, ఎన్‌డిపిఎస్‌పై) జిల్లా ఎస్.పి. ఎస్.వి.మాధవ రెడ్డితో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాని న్న నాలుగు నెలల్లోగా డ్రగ్ ఫ్రీగా మార్చాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా శ్రీసత్యసాయిజిల్లాను డ్రగ్‌ఫ్రీ జిల్లాగా మార్చాల్సిన ఆవశ్యకత ఉందని, ముఖ్యంగా జిల్లాలో ఉన్న కర్నాటక సరిహద్దు మండలాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాకు బెంగుళూరు దగ్గరగా ఉండడంతో అక్కడ ఉన్న పరిశ్రమల్లో దేశవ్యాప్తంగా కార్మికులు పనిచేసేందుకు వస్తుంటారని, పుట్టపర్తికి దేశవిదేశీ భక్తులు వస్తుండడంతో మత్తు పదార్థాలు వినియోగించే అవకాశం ఉందన్నారు. జిల్లాలో కొత్తగా కేసులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తత అవసరమన్నారు. మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలపై పాఠశాలలు, కళాశాలల్లో వారికి ఒకటి రెండు సార్లు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టుపరిశ్రమల శాఖ అధికారులు ఎక్కడైనా గంజాయి, ఇతరమత్తు పదార్థాలు సాగు చేస్తే సమాచారం అందించాలన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకొని పని చేసి డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా ఎస్పి ఎస్.వి.మాధవ రెడ్డి మాట్లాడుతూ, జల్లాలో ఎక్కడైనా గంజాయి దొరికితే ఎక్కడి నుండి తెస్తున్నారు? ఎవరికి సరఫరా చేస్తున్నారు? ఎవరు వాడుతున్నారు? లాంటి పూర్తీసమాచారం సేకరిస్తున్నారన్నామన్నారు. మత్తు పదార్థాలు అరికట్టడంపై ప్రభుత్వ గైడ్‌లైన్స్ పాటిస్తున్నామని, మత్తు పదార్థాలు వాడకుండా హిందూపురం ప్రాంతంలో పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి సాగుపై సమాచారం అందించాలన్నారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నా డి అడిక్షన్ సెంటర్కు వెళ్లాలన్నా 14500 అని టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పి పి.వి.రామకృష్ణప్రసాద్, సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్, డిఎస్‌పిలు గోవింద్, యశ్వంత్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, సోషల్ వెల్ఫేర్ డిడి శివరంగ ప్రసాద్, డిఎంహెచ్ఓ డా.ఎస్.వి.కృష్ణారెడ్డి, డిఇఓ మీనాక్షి, పట్టుపరిశ్రమల శాఖ జెడి పద్మమ్మ, బిసి వెల్ఫేర్ శాఖ అధికారినిర్మలా జ్యోతి, కదిరి ఆర్‌డిఓ రాఘవేంద్ర, తహశీల్దార్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో హిందూపురం ఎమ్మెల్యే వైసిపిదే - ఎంఎల్‌సి ఇక్బాల్


మీడియతో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇక్బాల్

**హిందూపురం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

రాష్ట్ర వ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరుగుతున్న క్రమంలో హిందూపురంలో శనివారం ఎంఎల్‌సి ఇక్బాల్ ఆధ్వర్యంలో మోటర్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జగన్ పేరుతో నినాదాలు చేస్తూ పార్టీ జెండాలు చేతబూని ప్రధాన రహదారుల్లో ర్యాలీ కొనసాగింది. అనంతరం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇక్బాల్ మాట్లాడారు. జగనన్నే మా నమ్మకం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా కోటి 45 లక్షల మంది స్పందించారని పేర్కొన్నారు. హిందూపురంలో కూడా అనూహ్య స్పందన వచ్చిందని రాబోయే ఎన్నికల్లో అసెంబ్లీ స్థానం వైసిపి గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. టిడిపివి చిల్లర రాజకీయాలని విమర్శించారు. బాలకృష్ణ పార్ట్‌టైం రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఏమి చేస్తామో కూడా చెప్పలేని దుస్థితిలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ బ్యాచ్ వుందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో చైర్‌పర్సన్ ఇంద్రజ, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, జెడ్‌పిటిసిలు, కన్వీనర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నేత చంద్రమోహన్‌పై హత్యాయత్నం


గాయపడిన చంద్రమోహన్


ఇంటిపై ఇటుకలతో దాడి చేసిన దృశ్యం

**హిందూపురం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ హిందూపురం పార్లమెంటరీ మీడియా కో ఆర్డినేటర్ చంద్రమోహన్‌పై శనివారం మధ్యాహ్నం దాడి జరిగింది. ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోతుకపల్లిలో చంద్రమోహన్ నివాసం పక్కనే వున్న గోవిందప్పకు చెందిన ఇంటి విషయంలో చాలా కాలంగా తగాదా నడుస్తోంది. ఈ క్రమంలో తమ ఇంటికి ఆనుకుని పక్కనే ఇళ్లు నిర్మిస్తున్న గోవిందప్ప కిటికీలను తమ జాగాలోకి వచ్చే విధంగా ఏర్పాటు చేస్తుండడంపై చంద్రమోహన్ ప్రశ్నించడంతో గొడవ ప్రారంభమైంది. చంద్రమోహన్ కుటుంబసభ్యులు మాట్లాడుతూ గోవిందప్ప అతని కుటుంబీకులు తదితరులు ఇటుకలతో తమ ఇంటిపైకి దాడికి దిగారని ఆ దృశ్యాలను మీడియాకు చూపించారు. అంతేకాకుండా చంద్రమోహన్ తలపై తీవ్ర గాయాలు కావడంతో 100కు సమాచారం వెళ్లడంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని బాధితున్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తలకు ఆరు కుట్లు పడినట్లు తెలిసింది. కాగా ఈ దాడిలో చంద్ర మోహన్ తల్లి తలకు కూడా గాయాల య్యాయి. గోవింద ప్పకు అధికార వైసిపి నాయకులు మద్దతు ఇస్తూ ఉద్దేశ్యపూర వ్రకంగా తమపై ఎగదోస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తనపై హత్యాయత్నం జరిగిందని పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

## దీర్ఘకాలిక సెలవులో జడ్పి సీఈఓ భాస్కర్‌రెడ్డి

**- ఇక మళ్లీ డ్యూటీకి రానట్లేనా..!**


జడ్పి సీఈఓ భాస్కర్‌రెడ్డి

**అనంతపురం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం జిల్లా పరిషత్ సీఈఓ భాస్కర్‌రెడ్డి వెళ్లినట్లు సమాచారం. అధికారి మళ్లీ సీఈఓగా డ్యూటీకి రానట్లేనని తెలుస్తోంది. జడ్పి చైర్మన్‌గా బో్య గిరిజమ్మ ఎన్నికైనప్పటి నుంచి జడ్పి సీఈఓగా భాస్కర్‌రెడ్డి కొనసాగుతూ వచ్చారు. జిల్లా పరిషత్ పాలక వర్గ వ్యవహార శైలి ఆ అధికారికి మింగుడు పడటం లేదని తెలుస్తోంది. ఆ అధికారికి పాలకవర్గ ముఖ్యులకు విధి నిర్వహణలో విధి నిర్వహణలో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. పాలకవర్గ ముఖ్యులు ఏకపక్షంగా కొన్ని నిర్ణయాలు తీసుకోవడం, ఆ అధికారిని సంప్రదించి సరిగా సంప్రదించకపోవడం విమర్శలు తావిస్తున్నట్లు తెలియవచ్చింది. గతంలో జిల్లా పరిషత్‌లో జరిగిన ఉద్యోగ బదిలీల్లో కూడా జిల్లా ముక్యులు ఏకపక్షంగా వ్యవహరించినట్లు బలంగా ఆరోపణలు ఉన్నాయి.